ప్రజాశక్తి సోపతి

డిసెంబర్ 28, 2014 ఆదివారం అనుబంధం

వన వసంతం



వెబ్ వెలుగుల తెలుగు

e-తెలుగు

- ఆశలు మోసులెత్తే కాలం
- బద్నామ్ : మన్నె ఏలియా కథ
- 2014లో ఉత్తమ ఆవిష్కరణలు
- పరమాత్మ, కోటం చంద్రశేఖర్ కవితలు



హృదయాన్ని హత్తుకున్న బాలీవుడ్ సినిమాలు

బాలీవుడ్‌లో అన్ని రకాల సినిమాలు ఈ సంవత్సరం ప్రేక్షకులను అలరించాయి. వాటిల్లో ప్రేమ కథలు, యాక్షన్, హాస్యభరిత సినిమాలు ఉన్నాయి. అంతేకాదు, ఈ సంవత్సరం విలువలతో కూడిన సినిమాలు కూడా వచ్చాయి. అవి ఎప్పటికీ గుర్తుండిపోయే సినిమాలు. వాటిల్లో జీవిత కథలు కూడా ఉన్నాయి. ఈ సినిమాలు పెద్దగా కమర్షియల్ హిట్ ఇవ్వకపోయినా హృదయాన్ని హత్తుకునే సినిమాలు. అవి ఏమిటో చూద్దామా!

మేరీ కోమ్: ఈ సంవత్సరం బాగా ఎదురుచూసిన సినిమాలలో ఇది ఒకటి. మణిపూర్‌కు చెందిన బాక్సర్ మేరీకోమ్ జీవిత చరిత్ర ఆధారంగా తీసిన సినిమా ఇది. దీనిలో ప్రియాంక చోప్రా మేరీకోమ్ పాత్ర పోషించారు. ఒక స్త్రీ తన కలను సాధించుకోవడానికి ఎలాంటి ఒడిదుడుకులనైనా ఎదుర్కొని సాధించగలదు అని నిరూపించిన మేరీకోమ్ జీవితాన్ని తమ కలల కోసం పోరాడుతున్న ఎందరో మహిళలకు ఆదర్శంగా నిలిచింది.

క్వీన్: కంగనారనౌత్ ముఖ్యపాత్ర పోషించిన ఈ సినిమాలో కుటుంబమే సర్వస్వంగా ఒక మధ్యతరగతి అమ్మాయిగా నటించింది. సగటు భారతీయ అమ్మాయిలు తన పెళ్ళి గురించి ఎలా ఆలోచిస్తుందో కళ్ళకు కట్టినట్లుగా దీనిలో చూపించారు. సామాజిక కట్టుబాట్ల మధ్య పెరిగిన అమ్మాయి ఒకత్తె విదేశాలకు వెళ్ళి తనకు తెలియని ప్రపంచంలో ఎలా మనగలిగిందో వివరించే సినిమా ఇది. ప్రతి ఒక్కరి హృదయాలను ఆకట్టుకున్న సినిమా క్వీన్.

హవా హవాయి: ఒక అబ్బాయి తన కలయైన స్కేటింగ్‌ను నేర్చుకోవడానికి పడే శ్రమను ఈ సినిమాలో చూపించారు. ఆ బాలునిలో తన కల పట్ల ఉన్న అంకితభావాన్ని, ధృడనిశ్చయాన్ని ఎంతో చక్కగా చూపించారు.

హైవే: ఒక అమ్మాయి ఎలాంటి కట్టుబాట్లు, నిబంధనలు లేకుండా తనకు ఇష్టమైనట్లుగా జీవించడానికి హక్కు ఉందని అలా జీవించడానికి ఇష్టపడే అమ్మాయి కథనే ఈ హైవే సినిమా. సినిమా చూసిన తర్వాత మనకు కూడా ప్రయాణాల మీద ఇష్టం కలగకమానదు.

గులాబ్ గ్యాంగ్: ఉత్తరప్రదేశ్‌కు చెందిన సంపత్ పాల్ దేవి తన గ్రామంలో అమ్మాయిలపై జరుగుతున్న గృహహింస, దాడులకు వ్యతిరేకంగా గులాబీ పేరుతో ఒక గ్యాంగ్‌ను తయారు చేసి ఆ గ్రామంలో గస్తీ చేస్తుంటారు. ఆమె స్ఫూర్తిగా తీసుకొని తీసిన సినిమానే గులాబ్ గ్యాంగ్. దీనిలో సంపత్ దేవి పాత్రను మాధురీ దీక్షిత్ పోషించారు.

మర్ధానీ: సెక్స్ రాకెట్‌ను ఛేధించడానికి నియమించబడ్డ లేడీ పోలీస్ ఆఫీసర్ రాణీ ముఖర్జీ. తన పాత్ర మొత్తం అమ్మాయిలను రక్షించే పోలీస్ ఆఫీసర్‌గా చాలా బాగా నటించింది రాణీ.

ఛార్‌ఫుతియ చోక్‌రే: ఒక గ్రామానికి చెందిన పిల్లలను నేరాలకు, లైంగిక చర్యలకు ఉపయోగిస్తుంటారు ఆ ప్రాంత రాజకీయ నాయకులు. ఒక ఎన్‌ఆర్‌ఐ ఈ గ్రామంలో పాఠశాలకు ప్రారంభించాలను కుంటుంది. తన ప్రయత్నానికి అడ్డుతగులుతూ ఉండే రాజకీయ నాయకులకు ఎలా బుద్ధి చెప్పిందనేది ఈ సినిమా కథ. ఇది కమర్షియల్ హిట్ కాకపోయినా అందరినీ ఆలోచించే సినిమాగా మిగిలిపోయింది. ఎన్‌ఆర్‌ఐగా సోహ అలీఖాన్ నటించింది.

లక్ష్మి: కిడ్నాప్ చేసి వ్యభిచార గృహానికి అమ్మిన పద్నాలుగేళ్ళ అమ్మాయి భయంకరమైన కథనే ఈ సినిమా. ఈ సినిమా లక్ష్మి పాత్ర తన రేపటి జీవితంపై ఆశలను వదులుకోకుండా సానుకూల దృక్పథంతో ఎలా జీవితాన్ని నెట్టుకొచ్చిందో తెలిపే కథ ఇది. ఈ సినిమా హృదయాలను హత్తుకుంటుంది.

– నక్షత్ర

■ అంతరంగం

కాలం

సాధారణమైన అంశాలకి అసాధారణతను ఆపాదించడం మనుషులకే చెల్లింది. మామూలు విషయాల్ని ఉత్సవభరిత సన్నివేశాలుగా పరిగణిస్తారు. వేలాది సంవత్సరాల మానవ ప్రయాణం అవిచ్ఛిన్నమైంది. కాలం ఒక నిరంతర ప్రవాహం. ఆ ప్రవాహంలో రోజులు, వారాలు, నెలలు, సంవత్సరాలు గడిచిపోతుంటాయి. అసలు కాలానికి ఇలా విభజించి పేర్లు పెట్టామని కాలానికి సైతం తెలియదు. ఇదే మానవ జీవితంలోని వైచిత్రి. ఎంతో వెనక్కి వెళ్ళక్కర్లేదు గానీ వందేళ్ళ కిందట ఈ నేల మీద క్యాలెండర్ మారినప్పుడల్లా ఎగిరి గంతులేసిన దృశ్యాలు లేవు. మన తాతయ్యానో, అమ్మమ్మనో అడిగితే సంవత్సరాలు దొర్లిపోయిన సంగతులు తెలిసేవి కాదని చెబుతుంటారు. అయినా చిన్నచిన్న సంఘటనలని సైతం అప్పుడే కొత్తగా పుట్టినంత, సరికొత్తగా కనుగొన్నంత ఉత్సాహంతో పండగల్లా జరుపుకుంటున్నారు. హద్దుల్లేని అమాయకత్వమే వీటిలో కనిపిస్తోంది.

అలాగే కాలాన్ని కొలమానంగా చేసుకొని మనుషులు కొన్ని నిర్ణయాలు తీసుకోడానికి ప్రయత్నిస్తుంటారు. కొలమానాలతో పేచీలేదు. కానీ మన నిర్ణయాలకు కాలపు తూనికరాళ్ళకు సంబంధం లేదని అర్థం చేసుకోవాలి. తమ మీంచి సంవత్సరాలు దొర్లిపోతుంటే నిశ్చేష్టులయి చూస్తుంటారు మనుషులు. అంతలోనే పాత క్యాలెండర్‌ని పక్కన పెట్టే ప్రతి సందర్భంలో ఒక వగపు, ఒక పశ్చాత్తాపంతో తల్లడిల్లుతారు. ఇంతలోనే కాలం దొర్లిపోయిందా అని నిబిడాశ్చర్యంతో వాపోతుంటారు.

తాము చేయాలనుకున్న పనులకీ, చేరుకోవాలన్న లక్ష్యాలకీ కాలంతో సంబంధం ఏమిటి? వాయిదాల తత్వం వీడి జీవితాన్ని జీవించడం, చేయాల్సిన పనులు చేయడం కర్తవ్యంగా తలపోయాలి. కొత్తగా నిర్ణయాలు ఎన్నో తీసుకోవడం కన్నా, తీసుకున్న నిర్ణయాలకు నిబద్ధులయి జీవించాలన్న నిర్ణయం మంచిది. పట్టు సడలిస్తే కాలం చేజారిపోతుంది. నిర్ణయాల మీద నిలబడకపోతే ఏదీ చేయలేరు. ఏ లక్ష్యమూ చేరుకోలేరు. పక్కా ప్రణాళికతో పనులు చేయడం మంచిదే. దానిలోని సాఫల్య వైఫల్యాల సమీక్ష కూడ అవసరం. పొరపాట్లను సవరించుకుంటూ, వైఫల్యాల్నించి నేర్చుకుంటూ ముందుకు వెళ్ళడానికి ఇది తోడ్పడుతుంది.

మీరు తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా కాలం గడపాలి. ఎందుకుంటే మీ నిర్ణయాలకు మీరు కట్టుబడి ఉండకపోతే మీ మీద ఇతరులు తమ నిర్ణయాలను రుద్దుతారు. అందుకని ఇతరేతర ప్రభావాలకు లోను కాకుండా స్వీయ ఆలోచనతో నడుచుకోవాలి. సాటి మనుషులకు వీలయినంత ఎక్కువ మేలు చేయాలన్న సంకల్పంతో జీవించాలి. పదుగురికి ఉపయోగపడేలా బతుకును మలుచుకోవాలి. ఆహార విహారాదుల్లో సహజమైన పద్ధతులు పాటించాలి. అప్పుడే సంవత్సరాలు ఎన్ని గడుస్తున్నా కాలాన్ని హుందాగా స్వీకరించడం సాధ్యం.

వెంటాడే వాక్యం

యాభైమంది మామూలు మనుషులు చేసే పనిని ఒక యంత్రం చేయగలదు. కాని ఒక అసాధారణ వ్యక్తి చేసే పనిని ప్రపంచంలోని ఏ యంత్రమూ చేయలేదు.

– ఎల్బర్ట్ హబ్బర్డ్

ప్రజాశక్తి

సోపతి

డిసెంబర్ 28, 2014

లేఖలు	4
కవర్‌స్టోరీ	
వెబ్ వెలుగుల తెలుగు	5
బాలచందర్ సినిమా	
స్త్రీ నుంచి స్త్రీకి చేసిన ప్రయాణం	8
సృజన	
నవ వసంతం	10
ఆశలు మోసులెత్తే కాలం	12
నెమలీక	14
సీరియల్ ప్రేమ - విప్లవం	16
కథ	
బద్నామ్	18
రుమటాయిడ్ ఆర్థరైటిస్‌కు మేలైన వైద్యం	21
సోర్స్‌కోడ్ 2014లో ఉత్తమ ఆవిష్కరణలు	22
వికాసం లక్ష్యమేంటో ఈ రోజే గుర్తించండి	23
సమీక్షలు	
వస్తువైశాల్యం ఈ పాటల ప్రత్యేకత	24
నాకు నచ్చిన పుస్తకం భువనఘోష	25
ఈ వారం కవిత్వం	
కవి ఉద్వేగాలు	26

ఇంటర్‌నెట్‌లో తెలుగు వాడకం పెరుగుతున్న తీరుతెన్నులు తెలుగుభాష పరివ్యాప్తిని సూచిస్తున్నాయి. ఈ పరిణామాల పరంపరపై విశ్లేషణే ఈ వారం ముఖచిత్రకథనం.

లేఖలు

చదివించే పుస్తకాల స్టోరీ

ఆదివారం ప్రజాశక్తిలో కవర్‌స్టోరీగా వచ్చిన 'పుస్తకానికి మహర్దశ' చదివిన తర్వాత పుస్తకాలు మనందరి నేస్తాలు అని, కాలక్షేపం కోసమే కాకుండా విజ్ఞానాన్ని పెపొందించేవి పుస్తకాలేనని తెలుసుకోవచ్చు. పుస్తకాలు చదివే పాఠకుల సంఖ్య క్రమంగా పెరుగుతుండడం శుభసంకేతంగా భావించవచ్చు. సంపాదనలో ఎంతో కొంత మంచి పుస్తకాల కోసం ఖర్చు చేయడానికి ప్రాధాన్యత ఇవ్వాలి. 'బుక్ ఫెయిర్'లు అన్ని ఊళ్లలో ఏర్పాటు చేయలేరు కాబట్టి, అప్పుడప్పుడు వచ్చే మొబైల్ పుస్తక వాహనాల దగ్గర తప్పకుండా అవసరమైన పుస్తకాలను కొని చదివే అలవాటు చేసుకోవాలి. ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవాటు ఉండాలి.

- కామిడి సతీష్‌రెడ్డి, పరకాల, వరంగల్

సద్వినియోగంతోనే ప్రతిభకు గుర్తింపు

నివాళి వ్యాసం ద్వారా సంగీత కళానిధి నేదునూరి కృష్ణమూర్తి గురించి ఎన్నో విషయాలు తెలిశాయి. విజ్ఞానానికి, ప్రతిభకు పేదరికం అడ్డు రాదు అని నేదునూరి నిరూపించారు. మాలి కచ్చేరీలో తనకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంతోనే ఆయన ప్రతిభకు గుర్తింపు వచ్చింది. తనకిష్టమైన వయొలిన్ కూడా వదులుకుని నరసింగరావు గారి సలహా మేరకు సంగీతంపై దృష్టి పెట్టిన నేదునూరి అందులోనే ప్రావీణ్యం సంపాదించి కర్ణాటక సంగీతంలో అన్నమాచార్య, రామదాసు కీర్తనలకు వన్నె తెచ్చారు. ఎంత పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్నా వినమ్రంగా ఉండడం ఆయన గొప్పతనంగా చెప్పుకోవాలి.

- సత్యనారాయణరావు, కరీంనగర్

మధురమైన ఎదురు చూపులు

'నిరతము చింతన మధురమే కాదా?' వ్యాసంలో ఎంతో వాస్తవం వుంది. ఉరుకులు పరుగులు జీవితంలో ప్రేమించిన వాళ్లకోసం రోజూ గంటల తరబడి కూర్చుని కబుర్లు చెప్పాలంటే వీలవని పరిస్థితి. అలా కబుర్లాడుకుంటేనే ప్రేమించినట్లంటే అందులో వాస్తవం లేదు. అలాంటి ప్రేమ ఎక్కువ కాలం నిలబడదు కూడా. చదువుకునేటప్పుడు ప్రేమిస్తున్నాం అనుకునే ప్రేమికులంతా కాలాన్ని వృథా చేసినా, ఏదో ఒక వృత్తి బాధ్యతలు తీసుకున్న తర్వాత అవన్నీ సాధ్యం కాదు. దీన్ని అర్థం చేసుకుని ఒకరి కోసం మరొకరు ఎదురు చూపులు చూసుకోవడంలోనే మధుర భావన ఉందనడం ఎంతో హాయినిస్తుంది.

- సాహిత్య, ఖమ్మం

కొండపల్లికి ఆ గౌరవం దక్కాలి

కొండపల్లి శేషగిరిరావు లాంటి గొప్ప కళాకారులకు లభించాల్సిన గౌరవం రాలేదనటంలో అసత్యమేమీ లేదు. ఆర్థిక సమస్యలను కూడా పక్కన పెట్టి శాంతినికేతన్‌కి వెళ్లి చిత్ర కళను అభ్యసించిన శేషగిరిరావుగారి చిత్రాలకు మ్యూజియం ఏర్పాటు చేయాల్సి అవసరం ఉంది. మన కళాకారులను మనమే గుర్తించి గౌరవించుకోకపోతే, మరెవరూ గుర్తించరు. ప్రభుత్వం ఈ విషయంలో దృష్టి పెట్టాలి.

- నీలకంఠనాథ్, మహబూబ్‌నగర్

కదిలించే కవిత్వం

అంతరంగంలో కవిత్వం, కవిత్వ లక్షణాల గురించి చక్కగా చెప్పారు. పాఠకులను కదిలించి, ప్రభావితం చేయగల కవిత్వం రాసినప్పుడే ఆ కవిగి నిజమైన గుర్తింపు లభించినట్లు.

- వాసుదేవ్, హైదరాబాద్

మన జాతీయాలు

తుమ్మడు జక్కడు

ఊరు పేరు లేనివారు, అనామకులు, ఎంపికకు మాత్రం పనికి వచ్చేవారు, విలువ గలిగినవారు కాదనుట. "వంతు నిండాలని సభ నిండ కనిపించటానికి తుమ్మడు జక్కడు, దొరికినోన్నల్లా లోపలికి నూకింద్రు" అనటంలో ఈ జాతీయం వాడుకలో వుంది.

కాశగడ్డి కావడి

గడ్డి ఎన్నోరకాలు. కాశగడ్డి కనుపులు దేరి కుదుళ్ళు కుదుళ్ళుగా నిలువెత్తు వరకు పెరుగుతుంది. జంతువులకు పొదలుగా కూడా పనికి వస్తుంది. ఎక్కువ బరువును ఒకేసారి మోయటానికి కావడి ఉపయోగపడుతుంది. పెద్దవాళ్ళు కావడితో బరువులు మోయగా చూసి పిల్లలు కూడా బొమ్మరిల్లాటలో తాము కూడా కావడి మోయటాన్ని అనుకరిస్తారు. అయితే పొడుగాటి కాశపుల్లలను జత చేసి వాటి కొసలకు మట్టి గురుగులను కట్టి కావడిలా అమ్మ ముందు మోస్తారు. పెద్దవాళ్ళు కావడిమోతను కాశపుల్లల కావడి ద్వారా చేసి చూపిస్తారు. దాంతో తల్లి ఎంతో సంతోషిస్తుంది. కావడికి బదులు కావడన్న మాటే కాని దీంతో పనిభారం తగ్గేదేముండదు. కొందరు ఒళ్ళు వంచి పని చేస్తారు. కొందరు పని చేసినట్లే చేస్తూ పనిభారాన్ని తప్పించుకుంటారు. అందుకే పదిమందిలో పని సుఖం అన్న సామెత కూడా స్థిరపడింది. "పాపం రాముడొక్కడే బండెడు కట్టెలు లోపలికి మోసె. అటూఇటూ పిర్రలు తిప్పి నేను మోస్తి కాశగడ్డి కావడని నీవు తయారయితివి తిండికాడికి" అన్న యజమాని హెచ్చరింపులో ఈ జాతీయం ఉంది.

పసూరం పసూరం అయ్యింది

పరువు బజారు పాలైంది. చేసిన తప్పు బయటికి పొక్కింది. ఇంట్లో గుట్టుగా వున్న సంగతి రట్టు అయ్యిందనుట. "ఎవరికి తెలియది మా ఇంటి సంగతి అనుకుంటున్నారు. అవతల పసూరం పసూరం అయ్యింది. బిడ్డ లేచిపోయిన సంగతి ఇంకా గుర్తెరుగుతలేదు" అనటంలో ఈ జాతీయం ప్రయోగం చూడొచ్చు.

మొక్కంగ చేతులు కోసినట్లు

నమ్మినవాన్ని నాశనం చేయుట, శరణం జొచ్చినవాన్ని హింసించుట, ఎదురు తిరిగిన వాన్ని అణగదొక్కటంలో కొంత స్వాభిమానముంది. కాని వేడుకున్న వాన్ని చంప చూడటం పాశవిక చర్య అనుట. "నేను తప్పు చేయలేదు. మంది మాటలకు నన్ను కొట్టకుండ్రి దొరా అని అన్నా వినకుండా మొక్కంగ చేతులు కోసినట్లు పోలీసులకు పట్టించి మరింత కొట్టిపిచ్చిండు" అనటంలో ఈ జాతీయం ప్రస్తావన వుంది.

- వేముల పెరుమాళ్ళు

■ కవర్ స్టోరీ

వెబ్ వెలుగుల తెలుగు

ప్రపంచం చాలా చిత్రమైంది. ఒక తీవ్రత నుంచి మరో తీవ్రతలోకి ప్రయాణిస్తుంటుంది. ఇంగ్లీషు చదువుల వల్ల తెలుగు వాడకం తగ్గుతుందని, భాష ప్రమాదంలో పడుతుందని గగ్గోలు పెడుతుంటారు కొందరు. కానీ ఆ ఇంగ్లీషు చదువులు చదివిన వారే తిరిగి తెలుగుభాషలో కార్యకాలాపాలు సాగిస్తూ ప్రపంచాన్ని విస్తుపోయేలా చేస్తున్నారు.

తెలుగులో మాట్లాడుతున్నారు. తెలుగులో రాస్తున్నారు. తెలుగునే ఎక్కువగా వాడుతున్నారు. ఇందుకు వెబ్ ప్రపంచంలో వెలుగుతున్న తెలుగుతీరుతెన్నులే తార్కాణం. అంతరించిపోయే భాషల్లో తెలుగు చేరే ప్రమాదముందని అప్పుడెప్పుడో ఐక్యరాజ్యసమితి ఓ చిన్న హెచ్చరిక చేసింది. దాని ప్రభావమో, ఇతరేతర కారణాలో గానీ ఇంటర్నెట్‌లో తెలుగు వాడకం మునుపెన్నడూ లేనంతగా పెరిగింది.

తెలుగు భాష సాహిత్యాలు చదువుకున్నవారే తెలుగు వాడుతున్నారని పొరపడవద్దు. తెలుగు సాహిత్య విద్యార్థులు కాని వేలాదిమంది తెలుగువారు దేశదేశాల్లో పరివ్యాప్తమై వున్నారు. వారే ఇవాళ వెబ్ వెలుగులకు తెలుగు అందచందాల్ని సమకూరుస్తున్నారు. వృత్తికోసమో, ఉపాధి కోసమో ఇతరేతర పనులేవో చేస్తున్నా తెలుగుభాషతో నిత్యం సంబంధ బాంధవ్యాలు కొనసాగిస్తున్నారు. తెలుగులోనే రాస్తున్నారు. తెలుగులోనే ఈమెయిల్స్ పంపుతున్నారు. తెలుగులో బ్లాగ్స్ రాయడం మొదలెట్టి కొనసాగిస్తున్నారు. చిన్నచిన్న వెబ్ పత్రికల్ని నడిపిస్తున్నారు. అనేక అంశాల మీద బ్లాగులు రాస్తూ తెలుగు సామాజికులతో అనునిత్యం సంభాషిస్తున్నారు.

యూనికోడ్ ద్వారా ఎప్పుడయితే తెలుగులో టైప్ చేయడం సులువయిందో ఆనాటి నుంచి తెలుగులో రాయడం విస్తృతమైంది. తొలుత లేఖిని ద్వారా ఈ సౌకర్యం విస్తరించింది. తర్వాత వివిధ బ్లాగులకు చెందినవారు కూడా తెలుగులో నేరుగా టైప్ చేయడమెలానో చెబుతున్నారు. తెలుగు వికీపీడియా కూడా ఇందుకు సహకరిస్తుంది. తెలుగులో మీ గురించి, మీ ఊరు, జ్ఞాపకాలు, చిన్నప్పటి స్నేహితులు, లోకం పోకడలపై అభిప్రాయాలు ఎన్నో రాసుకోవచ్చు. కనుక తెలుగులో బ్లాగు రాయడం ఆరంభించాల్సిందిగా 'తెలుగు బ్లాగ్ వరల్డ్' కోరుతుంది. ఇందుకోసం మీకు సహకరించడానికి దీని నిర్వాహకులు సిద్ధంగా వున్నారు.

యూనికోడ్ ద్వారా రాసిన తెలుగు రచనల్ని అను ఫాంట్స్‌లోకి, అను నుంచి యూనికోడ్ ఫాంట్స్‌లోకి మార్చగల సౌలభ్యం వల్ల ఇంటర్నెట్‌లో తెలుగు వాడకం వెల్లువలా వ్యాప్తి చెందుతోంది. ఈబుక్స్ పరంపరగా వస్తున్నాయి.

పరిమితులేవు

అచ్చులో కన్నా ఎక్కువగా బ్లాగుల్లోనే వస్తువైవిధ్యం వుంది. అనేకానేక అంశాల మీద తెలుగులో బ్లాగులు నిర్వహిస్తున్నారు. ఎవరయినా తాము తలపోసే అంశాల గురించి రాసి పోస్టు చేయడం తేలిక. అయితే వారు చెప్పే విషయాల పట్ల ఆసక్తి, చెప్పే విధానంలో కుతూహలం వున్నవారు ఒకసారి ఆ బ్లాగ్‌ను చూస్తే మరలమరల నిత్యం దర్శిస్తారు. ఇష్టమైన అంశాల్ని చదువుతారు. కనుక బ్లాగు రాయడం ఒక్కటే ముఖ్యం కాదు. పాఠకుల్ని తమ వెంట తీసుకువెళ్ళగల సామర్థ్యం ఉండాలి. బ్లాగురాసే వారి సృజనాత్మక అభిరుచులు వారి పాఠకుల సంఖ్యని నిర్ణయిస్తాయి.

మానస చామర్తి, మండువ రాధ, చిమ్మని మనోహర్ వంటి వారి బ్లాగులు చూస్తే చదవాలనిపిస్తుంటుంది. చెప్పేవిధానంలో వినూత్న కోణాలు ఉంటాయి. మనోహర్ సినిమాల గురించి అనేక విషయాలు చెబుతారు. మానస బ్లాగులో వైవిధ్యం అపారం. ఆమె ఏ విషయం గురించి రాసినా సున్నితత్వం, సృజనాత్మక నైపుణ్యం దర్శనమిస్తాయి. ఈరకమైన ప్రతిభను చూపేవారి బ్లాగులు వెబ్ ప్రపంచాన్ని అందమైన తెలుగుతో వెలిగిస్తున్నాయి.

అనేకరకాల అభిరుచులున్నవారు బ్లాగులు రాస్తున్నారు. వారి స్థాయిని బట్టి, విషయాన్ని బట్టి పాఠకుల సంఖ్య విస్తరిస్తోంది. ముఖ్యంగా తెలుగులోని నిర్దిష్ట ప్రాంతాల గురించి, సమూహాలను ఉద్దేశించి రాసే బ్లాగులకు అభిమానులు వేలల్లో వున్నారు. మీ బ్లాగులను కూడలి, జల్లెడ, మాలిక వంటి ద్వారా ఇతరులతో జత చేసే వీలుంది. టెక్నాలజీ ఇచ్చిన సదుపాయం తెలుగువారిని దగ్గర చేసింది. తెలుగు భాష పరిమళాల్ని పదుగురితో పంచుకోడానికి వీలు కల్పించింది. తెలుగు మాట వినిపించదనే బెంగ లేకుండా చేసింది. ఈమధ్యన తెలుగు బ్లాగర్లు సమావేశమై బ్లాగిల్లును మరింత పెంచి పెద్ద చేసుకోవడం గురించి మాట్లాడుకోవడం శుభ పరిణామం. డిసెంబర్ 2న తెలుగు బ్లాగర్ల దినోత్సవంగా జరుపుకున్నారు. ఇవన్నీ బ్లాగులో వెలిగే తెలుగు కాంతులు దశదిశలా విస్తరించడాన్ని సూచిస్తున్నాయి.

ఫేస్‌బుక్‌లో వెలుగుతున్న తెలుగు

సోషల్ మీడియాలో గతంలో గూగుల్ ఆర్కుట్ ఒక ఆకర్షణ. కానీ కాలక్రమంలో ఫేస్‌బుక్ విస్తరించడంతో ఆర్కుట్ అంతర్థానమైంది. సమాజంలోని భిన్న సమూహాలకు చెందినవారు ఫేస్‌బుక్‌ని వాడుతున్నారు. తెలుగువారు తెలుగులోనే సంభాషణలు సాగిస్తున్నారు. వందలాది గ్రూపులు ఫేస్‌బుక్‌లో సంభాషిస్తున్నాయి. వారందరికీ తెలుగుభాష మంచి వాహిక. ఫేస్‌బుక్ అన్నిరకాల హద్దులు చెరిపేసింది. ఫేస్‌బుక్‌లో అకౌంట్ వున్న ప్రతి ఒక్కరు తమ అభిప్రాయాల పరంపరను షేర్ చేసుకుంటున్నారు. వందలాది బృందాల్లో చేరి అభిప్రాయాలు పంచుకోవడం సులువయింది. తామే కొన్ని స్నేహబృందాల్ని, అంశాల వారి బృందాల్ని ఏర్పాటు చేసి తమ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేసుకుంటున్నారు.



ఈ క్రమాన బ్లాగులు రాసేవారు సైతం ఫేస్‌బుక్ ద్వారా పాఠక బృందాలకు చేరువ అవుతున్నారు. డైరెక్టరీ ఆఫ్ బ్లాగులో వందలాది బ్లాగులు ఉన్నాయి. వారిలో అత్యధికులు తిరిగి ఫేస్‌బుక్ ద్వారా తమ పాఠక ప్రపంచాల్ని పెంచుకుంటున్నారు. స్నేహితులతో పరస్పరం సమాచారం ఇచ్చిపుచ్చుకుంటున్నారు.

తెలుగు భాషకు సేవ

తెలుగు వాడకంలో ప్రయోగాలు అనేకం. తెలుగులో తమకు తెలియని పదాల గురించి తెలుసుకోవడం, పదాల అర్థాల గురించి వాకబు చేసి అసలు అర్థాన్ని, సారాన్ని ఆకళింపు చేసుకోడం సులభమైంది. వెబ్‌సైట్లు, బ్లాగులు, ట్విట్టర్, ఫేస్‌బుక్ వంటివి ఇందుకు ఉపకరిస్తున్నాయి. అంతర్జాలం మంచి సాధనమైంది. ఈ కారణంగా శాస్త్ర, సాంకేతిక రంగాలకు సంబంధించిన అంశాల్ని కూడా తెలుగు ద్వారా తెలుసుకునే వీలు ఏర్పడింది.

ఫేస్‌బుక్‌లో చిన్నచిన్న కామెంట్లు పెట్టడం ద్వారా, ప్రశ్నలు, సందేహాలు వ్యక్తం చేయడం ద్వారా, సమాచారాన్ని, ఆనంద విషాదాల్ని పంచుకోవడం ద్వారా తెలుగు భాషను పరిపుష్టం చేస్తున్నారు. తెలుగు వారు ఎక్కువగా తెలుగులోనే తమ అభిప్రాయాల్ని పోస్టు చేయడం ఫేస్‌బుక్‌లో కనిపించే విశేషం. ఇదే అత్యంత ఆకర్షణీయం.

కవిసంగమం ఓ రికార్డు

ఫేస్‌బుక్‌లో తెలుగు సాహిత్యం వెల్లివిరుస్తోంది. దీనిలో ఎక్కువమంది సభ్యులున్న గ్రూపు కవిసంగమం. సాహిత్యానికీ, సాహిత్యంలో వివిధ ప్రక్రియలైన కథ, కవిత, విమర్శ, నాటకం వంటి ప్రక్రియలకు కూడా గ్రూపులున్నప్పటికీ కవిసంగమం అత్యధికులని ఆకర్షించే సంస్థగా ప్రసిద్ధి చెందింది. తెలుగు కవిత్వానికి ఓ చిరునామాగా ఫేస్‌బుక్ కవిసంగమం ఎదిగిందని దీని వ్యవస్థాపకుడు కవి యాకూబ్ చెప్పారు. దాదాపు రెండున్నర వేల మంది సభ్యులున్నారు ఈ గ్రూపులో. అనేకమంది కవిత్వాన్ని రోజూ పోస్టు చేస్తున్నారు. దీనిలో మేలిమి ఎంత అన్నది పక్కన పెడితే కవిత్వం రాయాలన్న తపన, కవిత్వం కోసం సమయాన్ని వెచ్చించడమే చెప్పుకోదగ్గ విషయాలు. కేవలం కవిత్వమే కాదు, ప్రతిరోజు ఒకరు కాలమ్స్ కూడా రాయడం విశేషం.

నున్నా నరేష్, మోహన్‌రుషి, వాహెద్, కాసుల ప్రతాపరెడ్డి, ఎం.నారాయణశర్మ, కొండవీటి సత్యవతి, మైథిలి అబ్బరాజు, జగద్ధాత్రి, మెర్సీ మార్గరెట్, కస్తూరి మురళీకృష్ణ, విల్సన్ సుధాకర్, వడ్డి ఓంప్రకాష్, దయానందరావు వంటి వారు ఫేస్‌బుక్‌లో యాక్టివ్‌గా కనిపిస్తుంటారు.

అనేకమంది రోజూ పోస్టులు పెడుతుంటారు. సామాజిక పరిణామాల మీద, ప్రపంచం పోకడల మీద నిశితమైన వ్యాఖ్యానాలు చేస్తుంటారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల రాజకీయాలు, సామాజిక పరిణామాల మీద చర్చోపచర్చలు చేస్తున్నారు.

అప్పటికప్పుడు జరుగుతున్న సంఘటనల మీద, నిష్క్రమించిన ప్రముఖుల మీద, అసాధారణ అంశాల పైనా తమ స్పందనల్ని అచ్చమైన తెలుగులో వ్యక్తం చేయడం విశేషం. ఆ మధ్యన బాపు మరణం తర్వాత ఫేస్‌బుక్‌లో జరిగిన చర్చ ఆసక్తికరమైంది. నిర్మొహమాటంగా తమ అభిప్రాయాల్ని వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి గుంజాటన లేదు. పదాల గారడీ లేదు. అక్షరాల ముసుగున దాగుడుమూతల్లేవు. ఒకవేళ అలాంటి దాగుడుమూతల్ని కూడా బట్టబయలు చేస్తున్నారు. కనుక కవిసంగమం గానీ, సాహిత్యం, సమాజానికి సంబంధించిన అంశాల మీద వెలువడే స్పందనలు తెలుగు సమాజాన్ని, భాషని ప్రభావితం చేస్తున్నాయి. విభిన్న అస్తిత్వాలకు చెందినవారి అభిప్రాయాలకు ఫేస్‌బుక్ వేదికయ్యింది. వీరంతా తెలుగులో సంభాషణ సాగించడం తెలుగు ప్రాధాన్యానికి తార్కాణం.

ప్రతి గ్రూపు కూడా ఏదో ఒక స్థాయిలో తెలుగు పరిమళాల్ని దశదిశలకు పరివ్యాప్తం చేస్తోంది. ఉదాహరణకు 'మణిమాలికలు' గ్రూపు. కేవలం రెండు పాదాలలో కవిత్వాన్ని వెలువరించే వారు అనేకులు. కొత్తగా కవిత్వం రాయడం మొదలుపెట్టినవారికి ఇది ఉపయోగకరం. దేశదేశాలకు చెందినవారు దీనిలో కవిత్వం రాస్తున్నారు. కాలిఫోర్నియాలో వున్నా, దుబాయ్‌లో వున్నా, స్విట్జర్లాండ్‌లో వున్నా తెలుగును మరిచిపోవడమనే ప్రశ్నలేదు. నిజానికి దూరాలు భాషపై ప్రేమను పెంచుతున్నాయి. ఈ కారణంగానే తెలుగు నేల మీద కన్నా తెలుగేతర ప్రాంతాల్లోనే తెలుగుభాష వెలుగులు విరజిమ్ముతోంది. తెలుగు వాడకంలో మన పొరుగు రాష్ట్రాలయిన కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడుకు చెందిన తెలుగువారి బ్లాగులు, వెబ్‌సైట్లు, ఈపత్రికలు పోషిస్తున్న పాత్ర విస్తారమైంది.

గ్లోబలైజేషన్ కారణంగా తెలుగు భాషకు ముప్పు వాటిల్లిందని కొందరు చెబుతుంటారు. కానీ ఆ గ్లోబలైజేషన్ క్రమంలో పాదుకున్న టెక్నాలజీ తెలుగు వెలుగుల్ని విశ్వవ్యాప్తం చేసింది. తెలుగుకు మునుపెన్నడూ లేనంతగా ఆదరణ లభిస్తోంది. ఆంగ్లం ఉపాధి కోసమయితే, తెలుగు తమ గుండెలోపలి తపనల అభివ్యక్తికి అన్న అవగాహన తెలుగువారిలో పాదుకుంది. వెబ్‌లో వెలుగుతున్న తెలుగు కాంతులే ఇందుకు నిదర్శనం.

– దుర్గాప్రసాద్

ఈ పత్రికలెన్నో

ఈమాట, విహంగ, కౌముది, పొద్దు, పుస్తకం, సారంగ, వాకిలి, కినిగె వంటి ఈపత్రికలు అనేకం కవుల, రచయితల రచనల్ని ప్రచురిస్తున్నాయి. కొత్తరచయితలకీ, పాతతరం రచయితలకీ కూడా ఈ బ్లాగులు మంచి వేదికలవుతున్నాయి. వారి మనోభావాల వ్యక్తీకరణకు సోపానాలవుతున్నాయి. కొన్ని ఈపత్రికలు రచనల పోటీలు కూడా నిర్వహిస్తున్నాయి. తద్వారా కొత్తతరం రచయితలు అనేకులు ముందుకొస్తున్నారు. వారి సృజనాత్మక విన్యాసం అబ్బురపరుస్తుంది. ఈ పత్రికల్లో వచ్చే కొన్ని మంచి రచనల్ని ప్రింట్ మీడియాకు చెందినవారు ప్రచురిస్తున్నారు. అలాగే కేవలం ఈపత్రికల్లోనే సీరియల్‌గా నవలలు రచించి పుస్తకాలు తీసుకువస్తున్నారు మరికొందరు. సొంతంగా బ్లాగులో సీరియల్‌గా కూడా నవలలు రాసి తర్వాత పుస్తకాలు తీసుకువస్తున్నారు. అలాగే బ్లాగులో చినచిన్న కథలు రాసి, తర్వాత పుస్తకాలుగా అచ్చువేస్తున్నారు. కె.ఎన్.మల్లీశ్వరి 'జాజిమల్లి' శీర్షికన బ్లాగు రాశారు. తర్వాత వాటన్నిటిని పుస్తకంగా ప్రచురించారు. బ్లాగులు చూడని ఇక్కడి తెలుగు పాఠకులకు ఈ పుస్తకం అందుబాటులోకి వచ్చింది. కాగా, ఈపత్రికల్లో, బ్లాగుల్లో వచ్చే రచనలు దేశదేశాల్లో స్థిరపడిన తెలుగు వారు చూస్తున్నారు. ఆ కోవకు చెందినవారి అభిరుచులని సంతృప్తిపరిచే రీతిలో ఈపత్రికలు నడుస్తున్నాయి. ఆ పత్రిక సామర్థ్యాన్ని బట్టి, ఇచ్చే కంటెంట్‌లోని కళావిలువల్ని బట్టి వాటికి పాఠకులు ఉంటారు.

హాస్యం, ఆధ్యాత్మికం వంటి అంశాలకు ఎక్కువగా పాఠకులు ఉండటం గమనార్హం. ఈపత్రికల్లో, బ్లాగుల్లో ఇలాంటి అంశాలు అనేకం కనిపిస్తాయి. ఏమైనా ఇవన్నీ తెలుగు చదవడం మీద, రాయడం మీద ఆసక్తిని పెంచడానికి తోడ్పడుతున్నాయి.

■ **బాలచందర్ సినిమా**

స్త్రీ నుంచి స్త్రీకి చేసిన ప్రయాణం

అకిరా కురసోవా అనే గొప్ప దర్శకుడు సినిమా గురించి రెండు మంచి మాటలు చెప్పాడు "సినిమా అనేది శునకం లాంటిది. వ్యాపారం దాని శరీరం. కళాత్మకత దాని తోక. ఎప్పుడూ శరీరమే తోకను ఊపుతుంది. తోక శరీరాన్ని ఊపడం ఎప్పుడో కానీ జరగదు.

రోజుకి ఇరవై ముప్పై సినిమాలు తేలికగా విడుదల అయ్యే భారతీయ సినిమా రంగంలో ఎప్పుడూ తోక మాత్రమే శరీరాన్ని ఊపే సినిమాలు తీసే దర్శకులు ఎంతమంది అంటే వేళ్ళమీద లెక్కించవచ్చు అనే జవాబు వస్తుంది. అలాంటి దర్శకుల్లో ముందు వరుసలో ఉండేది కె.బాలచందర్‌గా ప్రేక్షక హృదయాలను దోచుకున్న కైలాసం బాలచందర్.

సినిమా హీరో అంటే ధీరోధాత్తుడు, హీరోయిన్ అంటే అతి సహసశీలి అనే మూసలను బద్దలు కొట్టినవాడు బాలచందర్. హీరో ఎప్పుడూ మంచివాడు గానే ఎందుకు ఉండాలి? హీరో మనిషి అయితే మంచి చెడూ రెండూ అతడిలో ఉండాలి కదా? అనే ఆలోచనని రేకెత్తించే సినిమాలు బాలచందర్ సినిమాలు.

"ఈ బతుకెంత? దాని విలువెంత?" అని 'అంతులేని కథ'లో రజనీకాంత్ మత్తులో పాడుకుంటాడు. రజనీకాంత్ మంచివాడా? చెడ్డవాడా? హీరోనా? విలనా? లాంటి ప్రశ్నలు మనకు ఉదయించవు. అతడు మనలో మనిషి. తాగుడు అనే వ్యసనానికి బానిసయినవాడు. మద్యం నరనరాన మత్తు కలిగించాక అతడు మనిషి అనే స్పృహను కోల్పోతాడు. తిరిగి అతడు మారినాక తన బాధ్యతలను గుర్తించాక వెంటనే చనిపోతాడు. మళ్లీ కథ మొదటికి వస్తుంది. ఇంకా వుంది అని అంతులేని కథ ముగుస్తుంది.

జీవితం ఏ చట్రంలో ఒరుగుతుంది? ఏ నైతిక విలువల నీతి రేఖ మద నిలబడుతుంది? ఏ విలువలు మనిషిని అధ:పాతాళంలోకి నెట్టేస్తాయి. అసలు విలువలకి మనిషి జీవితంలో ఏ విలువ వుంది?

ఒక సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన యువతి తన కుటుంబాన్ని పోషించుకోవడం కోసం వ్యభిచార వృత్తిలోకి దిగుతుంది. కుటుంబం వీధిన పడకుండా వుండడం అనే సామాజిక బాధ్యతను నెరవేర్చడం కోసం వ్యభిచార వృత్తిలోకి దిగజారడం అనే నైతిక వైయక్తిక పతనానికి గురి కావడం అనే చర్చకి నీచ విలువ వుందా? ఉన్నత విలువను ఆపాదించగలమా?

41 సంవత్సరాల క్రితమ 'ఆరంగ్రేటం' చిత్రంలో బాలచందర్ ప్రమీల రూపంలో పలికిన విచికిత్స ఇది. ఈ ప్రశ్నలకు ఎవరు మాత్రం సంతృప్తికరమైన జవాబు చెప్పగలరు?

ప్రధానిగా పి.వి.నరసింహారావు, ఆర్థిక మంత్రిగా డాక్టర్ మన్‌మోహన్ సింగ్, ఆర్థిక సంస్కరణలకి, లాకులు ఎత్తి భారత ఆర్థిక వ్యవస్థను ప్రపంచ దేశాలలో అనుసంధానించక ముందు దేశంలో లైసెన్స్, గూండా రాజ్ నడుస్తుండేది. నిరుద్యోగం వేయి పడగల విషనాగై దేశ యువతరాన్ని నిర్దయగా కాటువేస్తూ వుండేది. అప్పుడు 'ఆకలి'కి ఏ ప్రతీకను చెపుతాం మనం? ఆకలి బాధకి ఏ ఉపమానం యివ్వగలం?

ఢిల్లీ వీధులలో, డ్రైనేజి కాలవలో నుండి ఒక యాపిల్ పండును తీసుకుని మనసారా కొరికి ఆకలి తీర్చుకున్న ఒక నిరుద్యోగ యువకుడు... సాంప్రదాయకంగా వస్తున్న బ్రాహ్మణ అభిజాత్యాలన్నింటిని వదులుకుని క్షురకుడిగా స్థిరపడినప్పుడు ఆ యువకుడి మానసిక స్థితి ఎలా వుంటుంది?

జీవితంలో కనిపించని చీకటికి దృశ్యరూపం ఇచ్చిన వాడు బాలచందర్. దు:ఖానికి, సుఖానికి, సంతోషానికి, విచారానికి మధ్య వున్న సరిహద్దు రేఖలను తుడిపేసి జీవితానికి, జీవితంలోని భావోద్వేగాలకి బలమయిన రూపాన్ని ఇచ్చినవాడు బాలచందర్.

స్త్రీ నుండి స్త్రీకి చేసిన ప్రయాణం బాలచందర్ సినిమా ప్రస్థానం.

స్త్రీ పాత్రలకు రంగు, రూపు, అందం, ఆహ్లాదం ఇచ్చిన మిగతా దర్శకులందరూ బొమ్మల్లాగా తయారు చేస్తే ఆ బొమ్మలకి ప్రాణం పోసిన వాడు బాలచందర్. స్త్రీ పాత్రలకి బాలచందర్ ఇచ్చిన పంచ ప్రాణాలు ఇవి. ధైర్యం, మనోనిబ్బరం, దృక్పథం, ప్రేమ, వాత్సల్యం. బాలచందర్ హీరోయిన్ ఎవరైనా ఈ పంచలక్షణాలతో పరిమళించాల్సిందే.

బాలచందర్‌కి ఈ శక్తి ఎక్కడి నుండి వచ్చింది? ఇదే ప్రశ్న బాలచందర్‌ని అడిగితే ఆయన వినమ్రంగా నవ్వి "మన చుట్టూ వున్న జీవితం నా కథలకు ముడి సరుకు. జీవితం దానికి అదే ఒక చలన సంగీతం. ఆ సంగీతం లోని ఒక నోట్‌ను మాత్రమే నే పట్టుకోగలిగాను"

ఈ జీవితాన్ని పట్టుకోవాలని ప్రయత్నిస్తే వేళ్ళ సందుల నుండి ఇసుక లాగా జారిపోతుంది. నీటి మూట చూస్తూ చూస్తూండగానే కరిగిపోతుంది. హృదయం ద్రవించి పారిపోతుంది. అచ్చు సింధుభైరవిలాగా!

కళాకారుడికి ప్రేరణ అవసరం. అది ప్రకృతి నుంచి అయినా, ప్రకృతికి ప్రతి రూపమయినా స్త్రీ నుంచి అయినా ఒక కర్ణాటక విద్వాంసుడు తన ప్రియురాలిని స్ఫూర్తిగా తీసుకుంటాడు. సంగీతంలో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తాడు. ఒక దురదృష్టకర సమయంలో ఆమె చనిపోతుంది.

ఏ స్త్రీ మూర్తి నుండి తనకు నిరంతర స్ఫూర్తి లభిస్తున్నదో, ఆ స్త్రీ మూర్తి కనుల ముందు లేకపోయేసరికి అతడి జీవితం గాఢాంధకార బంధురమవుతుంది. సృజన శక్తులు అన్నీ నిర్వీర్యమవుతాయి. హృదయంలో నుండి సంగీతం మాయమయి తాగుడికి అలవాటు పడతాడు.

అతడిని ఆ స్థితి నుండి బయట పడెయ్యడానికి ఇద్దరు స్త్రీలు పూనుకుంటారు.

స్త్రీ నుండి స్త్రీకి చేసిన ప్రయాణం బాలచందర్ సినిమా ప్రస్థానం.

స్త్రీ పాత్రలకు రంగు, రూపు, అందం, ఆహ్లాదం ఇచ్చిన మిగతా దర్శకులందరూ బొమ్మల్లాగా తయారు చేస్తే ఆ బొమ్మలకి ప్రాణం పోసిన వాడు బాలచందర్. స్త్రీ పాత్రలకి బాలచందర్ ఇచ్చిన పంచ ప్రాణాలు ఇవి. ధైర్యం, మనోనిబ్బరం, దృక్పథం, ప్రేమ, వాత్సల్యం. బాలచందర్ హీరోయిన్ ఎవరైనా ఈ పంచలక్షణాలతో పరిమళించాల్సిందే.

1930 జులై 9న తమిళనాడులోని తంజావూరు జిల్లా (ఇప్పటి తిరువారూరు) నన్నిలం గ్రామంలో కైలాసం దుడపాగ, సరస్వతి దంపతులకు బాలచందర్ జన్మించారు. అన్నామలై విశ్వవిద్యాలయం నుండి గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాక తిరువారూరు జిల్లాలో కొంతకాలం పాటు టీచర్‌గా, తరువాత ఎ.జి. కార్యాలయంలో ఎకౌంటెంట్‌గా పని చేసిన బాలచందర్, యునైటెడ్ అమెరికన్ ఆర్టిస్ట్ నాటక సమాజంలో సభ్యుడిగా కొనసాగి సొంతంగా ఒక నాటక ట్రూపును తయారు చేసుకున్నారు.

సర్వర్ సుందరం, మేజర్ చంద్రకాంత్ లాంటి స్వీయ నాటకాలతో తమిళనాట సంచలనం సృష్టించారు. అతడి ప్రతిభా పరిమళం ఎం.జి.రాంచంద్రన్‌ని తాకడంతో 'దైవత్తాయ్' చిత్రంలో డైలాగ్ రైటర్‌గా చిత్ర పరిశ్రమలోకి ప్రవేశించారు. తన సొంత నాటకం 'సర్వర్ సుందరం' చిత్రంగా విడుదలయి తమిళనాట సంచలనం సృష్టించింది. తెలుగులో కూడా ఆ సినిమా బాగా నడిచి బాలచందర్ ప్రభంజనానికి సూచికగా నిలిచింది.

ఆకలి రాజ్యంలో శ్రీదేవి మన స్నేహితురాలిలాగా అనిపించినా గుప్పెడు మనసులో సుజాత మనకు పెద్దక్కలాగా దిశా నిర్దేశం చేసినా దాని వెనక వున్నది బాలచందర్ సంస్కారం. అందుకనే ఆ పాత్రలు, పాత్రలుగానే సుఖదు:ఖాలు అన్నింటినీ స్వీకరిస్తాయి, ప్రదర్శిస్తాయి తప్పిస్తే సమర్థుడయిన రచయిత సృష్టించిన పరిణిత మనస్కులలాగా కనిపించవు. అపరిపక్వంగానూ ప్రవర్తించవు. అది బాలచందర్ విజయ రహస్యం.

తన నాటకం 'నీర్కుమిళి' స్వయంగా చలన చిత్రంగా మలిచారు. ఈ సినిమా మొత్తం దాదాపు ఒకటే సెట్ తీసి సంచలనం సృష్టించారు. అప్పటి నుండి బాలచందర్ ఇక వెనక్కు తిరిగి చూడలేదు.

బాలచందర్ సినిమా పేర్లు కూడా విలక్షణంగా వుండేవి. 'అగ్నిలో పూచిన పువ్వు, అపూర్వ రాగంగళ్, 47 రోజులు, అందమైన అనుభవం, తన్నీరు – తన్నీరు, తొలికోడి కూసింది'. సినిమా మొదటి షాట్‌లోనే రచన మొదటి వాక్యంలోనే కథంతా చెప్పేయడం బాలచందర్ స్టైల్.

కథలకు కావలసిన నేపథ్యాన్ని ఎన్నుకోవడంలో కూడా బాలచందర్ సిద్ధహస్తుడు. 'ఆకలి రాజ్యం' చిత్రానికి ఢిల్లీ బ్యాక్‌డ్రాప్‌గా ఎన్నుకుని, నిరుద్యోగ సమస్యని జాతీయ సమస్యగా చెప్పడమే కాకుండా విధాన కర్తల బాధ్యతా రాహిత్యానికి ప్రతీకగా కూడా నిలిపాడు. 'రుద్రవీణ'కి ఎన్నుకున్న గ్రామీణ వాతావరణం 'నీర్కుమిళి'లోని కల్పిత సెట్ బాలచందర్ సృజన తీవ్రతకి నిదర్శనాలు.

సమాంతర సినిమా, న్యూలుక్ సినిమా, కమర్షియల్ సినిమా... ఇలా ఏ పేరు పెట్టినా ఆ బ్యానర్‌లో బాలచందర్ సినిమా ఒరిగిపోతుంది. 'ఆకలి రాజ్యం' ని మించిన కమర్షియల్, సమాంతర, న్యూలుక్ సినిమా ఏం వుంది అసలు?

సంప్రదాయాన్ని ధిక్కరించి, సంప్రదాయవాదులతో కూడా 'సరే' అనిపించడం బాలచందర్‌కే చెల్లింది. బాలచందర్ అభిప్రాయాలతో ఏకీభవించకపోయినా, బాలచందర్ పరిష్కారాలు రుచించకపోయినా, బాలచందర్‌ని ప్రేమించకుండా ఉండలేం. జీవితంలో ఎదురయ్యే సమస్యలు అందరికీ ఒకటే! కానీ సమస్యల పరిష్కారాలు మాత్రం వైయక్తికం.

బాలచందర్ పరిష్కారాలు నచ్చకపోయినా తన కథన చాతుర్యానికి ప్రేక్షకుడు ఫిదా అయిపోతాడు.

బాలచందర్ సినిమా నిరలంకారమయిన స్వచ్ఛ శుభ్ర స్ఫటికం లాంటి వాక్యం. ఆ నిర్మలాకృతిలోనే అది వ్యవస్థీకృతమయిన అజ్ఞానాన్ని పటాపంచలు చేసింది.

కథా నాయకుడు లేదా కథానాయకి 'లార్జర్ దెన్ లైఫ్' వుండాలనే సినీ సామాన్య సూత్రాన్ని తిరగ రాసినాయి బాలచందర్ సినిమాలు.

రుద్రవీణలో శోభన, ఆకలి రాజ్యంలో శ్రీదేవి, గుప్పెడు మనసులో సుజాత, అంతులేని కథలో నారాయణరావు, తొలికోడి కూసింది లో జీవా... ఏ పాత్రయినా జీవితాన్ని మించి మనకు కనపడదు.

జీవితాన్ని, దాన్ని అంటుకుని వుండే పొరలన్నిటినీ ఒక్కొక్కటిగా వలుచుకుంటూ సత్యాన్ని సాక్షాత్కరింపజేయడం బాలచందర్ సినిమాలోలో కన్పించే తాత్వికత. సినిమా, జీవితం రెండూ పరస్పర చిత్రాలు అనుకోవడం బాలచందర్ చింతన. ఈ రెండింటిలో నుండి పుట్టినవి కె.బాలచందర్ సినిమాలు.

ఆకలి రాజ్యంలో శ్రీదేవి మన స్నేహితురాలిలాగా అనిపించినా గుప్పెడు మనసులో సుజాత మనకు పెద్దక్కలాగా దిశా నిర్దేశం చేసినా దాని వెనక వున్నది బాలచందర్ సంస్కారం. అందుకనే ఆ పాత్రలు, పాత్రలుగానే సుఖదు:ఖాలు అన్నింటినీ స్వీకరిస్తాయి, ప్రదర్శిస్తాయి తప్పిస్తే సమర్థుడయిన రచయిత సృష్టించిన పరిణిత మనస్కులలాగా కనిపించవు. అపరిపక్వంగానూ ప్రవర్తించవు. అది బాలచందర్ విజయ రహస్యం.

బాలచందర్ 101 సినిమాలకు దర్శకత్వం వహించారు. 50 మందికి పైగా కొత్త నటులకు జన్మనిచ్చారు లాంటి వాక్యాలన్ని కేవలం స్టాటస్టిక్స్ మాత్రమే. వీటితో బాలచందర్ స్మరించుకోవడం అంటే అపచారం చేసినట్టే.

'జీవా' అనే ఒక నటుడు తన కొడుక్కి కె.బాలచందర్ అనే పేరు పెట్టుకున్నాడు అంటే అది కేవలం దర్శకుడు, నలుడు మధ్య అనుబంధమే కాదు. ఒక గురువుగా శిష్యుడిని ప్రభావితం చేసిన సంస్కారం, శిష్యుడిగా గురువుని ఆరాధించిన సంప్రదాయం.

సంస్కారం, సంప్రదాయం అనే రెండూ రెండు జీవన వాహినులు. అవి ఏ పరిధులకి, ప్రమేయాలకి లొంగవు.

'ఇక లేరు' అనే మాటని కొంతమంది విషయంలో మనసు అంగీకరించదు. వాళ్ళు భౌతికంగా ఉన్నా లేకపోయినా మన అనుభవిక ప్రపంచంలో సందడి చేస్తూనే వుంటారు.

నిరంతరం మనలని డిస్టర్బ్ చేస్తూనే వుంటారు. బాలచందర్ మన సెన్సిబిలిటీస్‌ను డిస్టర్బ్ చేసే అరుదైన దర్శకుడు.

– వంశీకృష్ణ, 9573427422

■ సృజన

వన వసంతం

మొక్కలకు జీవం ఉంటుంది సరే, మనసు కూడా ఉంటుంది. మొక్కలతో మాట్లాడుతూ, ప్రేమగా నిమిరి పలకరిస్తే అవి ప్రతిస్పందిస్తాయని పరిశోధనలు చెప్తున్నాయి. కొందరు మూగజీవాలతో అనుబంధం పెంచుకుంటారు. మరికొందరు మొక్కలతో బంధం పెనవేసుకుంటారు. పెంపుడు జంతువుల్లాగే మొక్కలకీ ముద్దుపేర్లు పెట్టుకుని పిలుచుకునేవారున్నారంటే ఆశ్చర్యం కాదు. అదే కోవకు చెందిన మధుసూదన్ గౌడ్, ప్రమీలమ్మ దంపతులు జీవితమంతా మొక్కల మధ్య ఆనందాన్ని వెతుక్కుంటున్నారు. వారిది తెలంగాణలో మహబూబ్‌నగర్ జిల్లా, గోపాలపేట మండలం. ఇద్దరూ కలిసి ఒక్కో మొక్కా చేర్చుకుంటూ దాదాపుగా చిన్న సైజు అడివిని పెంచుతున్న వైనం చదవండి.

పొందికగా కట్టుకున్న ఇల్లు, ఇంటికి ఆనుకుని కట్టిన పొడవాటి పర్ణశాల. చుట్టూతా తోట. కాదు. తోట అనే పదం చిన్నదవుతుంది. వనం అనేపదం సరిపోతుంది. గేటు లోపలికి అడుగుపెడితే రెండువైపులా ఉన్న కొబ్బరి చెట్లు స్వాగతం పలుకుతాయి. చల్లగాలి తెమ్మెరలు, పూల పరిమళాలు, పండ్ల సువాసనలు అన్నీ కలిపి ఒకేసారి ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. కుడివైపున గులాబీల తోట. ఎడమవైపున ఉసిరి చెట్టుకు చప్టా కట్టి కింద గుండ్రంగా గచ్చు చేసి ఉంటుంది. ఎంత బావుందో అనుకుని తలతిప్పితే చెట్ల నిండా విరిసిన పూలతో16 రంగుల మందార చెట్లు. చిన్న గరుడవర్ధనం, నందివర్ధనం, చామంతి, బంతి, రాకీ ఫ్లవర్(సెక్రెటేరియేట్‌లో ఆ పువ్వు పూసిందని పేపర్‌లో ఫొటో వచ్చింది), నూరువరహాల చెట్టు, సన్నజాజి, విరజాజి, బొడ్డుమల్లె, రెక్కమల్లెతో సహా 5 రకాల మల్లెలు, నైట్‌క్వీన్, జర్బెరా పూలు, సిసిల్సియా, జినియా, లిల్లీలు, సంపెంగ, ఇలా లెక్కలేనన్ని పూల చెట్లు. కలువపూల కోసం ఒక కొలను కట్టారు. దాని పక్కనే ఎంతో అందంగా కట్టిన తులసికోట, ఆ పరిసర ప్రాంతం అలానే చూడాలనిపిస్తుంది. పూల చెట్ల సొగసులు చూస్తూ ఇంకొంచెం ముందుకు వెళ్తే అన్నీ వృక్షాలు. అరటి, దానిమ్మ, సపోటా, చిన్న ఉసిరి, పెద్ద ఉసిరి, మామిడి, పనస, బొప్పాయి, మునగ, కరివేపాకు, బాదం, నిమ్మ, నారింజ, బత్తాయి, వెలగ, సీతాఫలం, జామ, అంజీర, పండ్ల చెట్లు, బిల్వపత్రాలు, క్రిస్‌మస్, టేకు, వేప, సైకస్, తమలపాకు ఇలా ఎన్నో వెరైటీ చెట్లు. క్రోటన్ రకాలు లెక్కకు మించి ఉన్నాయి. ముఖ్యంగా ఔషధ మొక్కలు కూడా వనంలో భాగం. తులసికి ప్రత్యేక వనం ఉంది. రకరకాల బొన్సాయ్ మొక్కలు కూడా పెంచుతున్నారు. అంతా కలిపి దాదాపు ఎకరం స్థలం ఉంటుంది.

మధుసూదన్ గౌడ్ విశ్రాంత ప్రభుత్వ పశువైద్యాధికారి. ఆయన భార్య ప్రమీలమ్మ. ఇద్దరూ కలిసి పెంచుతున్న చిన్న అడవికి 'సాయివనం' అని పేరు పెట్టారు. అంత వనం పెంచడానికి ఎంత కష్టపడ్డారు, దాని వెనక ఇష్టాఇష్టాలేమిటో ప్రమీలమ్మ ఇలా చెప్తున్నారు...

"చిన్నతనం నుంచీ మొక్కలంటే ఇష్టం. ఎక్కడ ఉంటే అక్కడ చెట్లు పెంచడం అలవాటు. ఇప్పుడంటే సొంత ఇల్లు కాబట్టి ఇంత వనం పెంచాం. అంతకుముందు ఒక క్వార్టర్‌లో ఉండేవాళ్లం. అక్కడ పెరట్లో పెద్దస్థలం ఉండేది. అక్కడ కూడా మేం ఉన్నన్నాళ్లూ తోట పెంచాను. ఎన్నో రకాల పూల, పండ్ల మొక్కలతో చుట్టుపక్కల ప్రాంతం అంతా పచ్చదనంతో నింపేదాన్ని. నా ఇష్టం తెలుసుకుని మా పిల్లలు, బంధువులు అందరూ ఎవరు వచ్చినా మొక్కలు తెచ్చేవారు. మొక్కలతోనే నా అనుబంధం ఈనాటిది కాదనిపిస్తుంది. ఐదెకరాల వరి పొలంలో కూడా చెట్లు నాటించాను. మా ఇంటికి వచ్చినవాళ్లు అంటారు, "ఎన్ని కోట్లుంటే ఏం లాభం, ఈ ఆనందం వస్తుందా" అని. కాని ఇదంతా పెంచడానికి ఎంత కష్టపడ్డామో తెలుసా. నీళ్లకు ఇబ్బంది ఉండేది. మొక్కల పెంపకం కోసం రెండుచోట్ల బోరు తవ్వించాం. వర్కర్లను పెట్టుకుంటే చాలా డబ్బు ఖర్చు అవుతుంది. అందుకే మేమిద్దరమే శ్రమిస్తాం. నా ఆసక్తి చూసి మావారు కూడా మొక్కల పెంపకంలో పూర్తి సహాయం చేస్తారు. పొద్దున్న లేవగానే మొక్కలకు నీళ్లు పెట్టడం ఆయన డ్యూటీ. ఆయనకి పండ్ల

మొక్కలు ఇష్టం. నాకు పూల మొక్కలు ఇష్టం. రోజు మొత్తం మొక్కలతోనే సరిపోతుంది. పన్నెండేళ్లయింది ఇక్కడికి వచ్చి. ఇక్కడ ఇల్లు కట్టడానికి ఎవరూ ఇష్టపడలేదు. చుట్టూ పాడుబడిపోయి అడవిలాగా ఉండేది. చుట్టు పక్కల ఇళ్లు కూడా తక్కువ ఉండేవి. ఇక్కడ ఉండటం కష్టం అన్నారు. అయినా నోరు మంచిదయితే ఊరు మంచిదవుతుందనుకున్నా. ఒక్కదాన్నే వచ్చి ఇక్కడే ఉండి ఇల్లు కట్టించాను. వనపర్తిలో ఉన్న నా కూతురు రమ్మన్నా వెళ్లేదాన్ని కాదు. ఏం భయపడకుండా ఒక్కదాన్నే ఉండేదాన్ని. నాకు బంగారం, పట్టుచీరలు దేనిమీదా ఆసక్తి లేదు. మొక్కలుంటే చాలు. పాడుపడి ఉన్న స్థలాన్ని చదును చేసి ఒక్కో మొక్కా పెంచుకుంటూ రావడానికి చాలా కష్టమే పడాల్సివచ్చింది. మొక్కలు నాటడానికి గోతులను తవ్వడం సులభం కాదు. ఎరువులు వేసుకోవాలి. చాలా ఖర్చు పెట్టాల్సి వస్తుంది. ముందుగా కొబ్బరి చెట్లు నాటాను. మావారితో అంటుండేదాన్ని,“ చేతకాని రోజుల్లో ఈ కొబ్బరినీళ్లు తాగయినా బతకచ్చు” అని. ఇప్పుడు 100కు పైగా కొబ్బరి చెట్లున్నాయి. చాలా కాయలు దిగుతాయి. చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకు పరిష్కారం కూడా మా తోటలో ఉంది. చాలామంది నా దగ్గరకు వస్తుంటారు. ఔషధ మొక్కల నుంచి నేనిచ్చే ఆకు, అలముల మందు పట్టుకెళ్తుంటారు.

పెళ్లిళ్లకు, ఫంక్షన్లకు వెళ్తే నేను ఇచ్చే గిఫ్ట్ పూలబొకేనే. మా వనంలోనించే పూలు ఆకులు కలిపి బొకే తయారు చేస్తాను. గులాబీ తోటలోంచి సీజన్లో రోజుకి వందల పూలు పూస్తాయి. స్కూలు, కాలేజీ పిల్లలు వచ్చి తల్లో పెట్టుకోవడానికి అడుగుతారు. మిగిలిన పూలు వనపర్తి మార్కెట్‌కు పంపుతాం. తులసిమాల గుడికి పంపుతుంటాం. మారేడు ఆకులు పూజకోసం తీసుకెళ్తుంటారు. కలువ కొలను కోసం ఎంత కష్టపడ్డానో తెలుసా! వేరే ఊరి నుంచి చెరువు దాటి వచ్చే పిల్లలకి డబ్బులిచ్చి మట్టి, పూలు తెప్పించాను. వాళ్లకి ఒక కలువ పువ్వుకి ఒక గులాబీ పువ్వు ఇచ్చేదాన్ని. ఎంత కష్టపడ్డా ఒక ఏడాది వరకు పూయలేదు. దానికి చాలా డబ్బు ఖర్చు పెట్టాను. కాని, మొదటిసారి పువ్వు బయటకు వచ్చినప్పుడు పడిన ఆనందం మాటలతో చెప్పలేను. దానిముందు ఖర్చుపెట్టిన డబ్బుకి విలువలేదనిపించిది. తెల్లవారి ఐదు గంటలనుంచి ఒక్కో చెట్టును, పువ్వును పలకరించుకుంటూ తిరుగుతాను. అదే నాకు సంతోషం. మొక్కలతో పెంచుకున్న అనుబంధం ఒక్కోసారి బాధపెడుతుంది కూడా. ముందు వైపు అరటి తోట వేశాను. ఒక తోట పెరగాలంటే ఎంత కష్టపడాలి!

ఎవరో వచ్చి ఇంటి ముందు అరటి చెట్టు ఉండకూడదన్నారు. గెలలు కూడా వేస్తున్న అరటి తోట కొట్టేయాల్సి వచ్చింది. చాలా బాధపడ్డాను. నాలుగురోజులు తిండి సహించలేదు. కూరగాయల మొక్కలు కూడా వేశాం. కాని అవి ఇంటి వరకే సరిపోతాయి. వాటికోసం మరింత సమయం వెచ్చించి శ్రమపడాల్సి ఉంటుంది. ఇప్పటికే సమయం సరిపోవట్లేదు.” అంటూ చెప్పుకొచ్చారు.

పశువుల వైద్యులుగా పనిచేసి రిటైరయిన తర్వాత కూడా పశువుల మీద కరుణ, ప్రేమతో ఎక్కడ ఎవరి ఇంట్లో పశువులకు సంబంధించిన సమస్య ఉన్నా సహాయం చేయడానికి మధుసూదన్ గౌడ్ ముందుంటారు. తమ సాయివనం గురించి ఆయన ఇలా అంటున్నారు...

“ఇల్లు ఎత్తులో కట్టుకున్నాం కాబట్టి, పురుగులు, పాములు ఇటువైపు రావు. అయినా ఎప్పుడూ అవి ఇంటి ఆవరణలో వచ్చి ఉండాలనుకోవు. వాటి మానాన అవి ఎక్కడో చెట్లల్లో ఉంటాయి. మా వనంలో తులసివనం ప్రత్యేకం. దాన్ని ప్రత్యేకంగా పెంచనవసరం లేదు. విత్తనాలు రాలి దానంతట అదే తులసివనం తయారయింది. తులసి ఔషధ మొక్కగా పనికొస్తుంది. దానివలన విష జంతువులు రావు. చెట్ల నుంచి రాలిన ఆకులు, అలములతో కంపోస్ట్ పిట్ తయారు చేశాం. పశువుల పేడ అన్నీ వేసి తయారు చేసిన కంపోస్ట్ ఎరువును మొక్కలకు ఎరువుగా వాడతాం. మాకు ఎన్ని బాధలున్నా మొక్కల మధ్య తిరుగుతూ అంతా మరచిపోతాం. ఇంత తాజా గాలి పీల్చుకోవడమే మా ఆరోగ్య రహస్యం. మా పిల్లలు అందరూ సిటీలో స్థిరపడ్డారు. అక్కడికి వెళ్లడానికి ఇష్టం ఉండదు. మాకు ఈ తోటలోనే ఆనందం. పారిజాతం, గుళేబకావళి పూలు, హైబ్రీడ్ గులాబీలు ఇలా ఎన్నో రకాల పూలమొక్కలు మా తోటలో ఉన్నాయి. కోతులు పూలమొక్కల జోలికి రావు కాని, పండ్ల మొక్కలను ఎక్కువ పాడుచేస్తాయి. క్రికెట్ బాల్ సైజులో సపోటాలు వచ్చిన తర్వాత కోతులు తెంపి పడేస్తే బాధగా ఉంటుంది. చెట్లకు పండిన పండ్లు అందరికీ పంచిపెడతాం. ఇప్పటివరకు అమ్మడం అయితే లేదు. అరటిలో చెక్కెరకేళి, డ్యూయల్ పర్పస్ (పండుగాను, కూరకోసం) అరటి, టిష్యూకల్చర్ (కొత్తరకం) అరటి పెంచుతున్నాం. తేనెతుట్టెలు కూడా మా చెట్లకు ఎక్కువ పెడుతుంటాయి. తేనెటీగలు పర్యావరణానికి మంచిది. అందుకే అందరూ చేతనయినంతలో చెట్లు, మొక్కలు పెంచాలి. తేనెటీగలు పెరగనివ్వాలి. మొక్కల వలన స్వచ్ఛమైన ప్రాణవాయువు దొరుకుతుంది. కాలుష్యం నుంచి విముక్తి దొరుకుతుంది. ఆహ్లాదకరమైన పరిసరాల్లో చెట్లు, మొక్కలు పెంచుకుంటే ఆరోగ్యం బావుంటుంది. పర్యావరణ సమతౌల్యం కూడా జరుగుతుంది.

గవర్నమెంట్ , తెలంగాణలో మొక్కలు బాగా పెంచాలని ప్రకటన ఇచ్చారు. ప్రభుత్వ నర్సరీలు ఉన్నా ఇంకా సరఫరా చేయాల్సిన అవసరం ఉంది. మేం కూడా మొక్కలు సరఫరా చేయాలనుకుంటున్నాం. గ్రామం అభివృద్ధి చెందుతుందనే ఉద్దేశ్యంతో మా స్థలంలో ముందువైపు కొంతభాగాన్ని బ్యాంకు పెట్టడానికి ఉచితంగా ఇచ్చాం. మనం ఒక్కళ్లం బావుంటే చాలదు. మన ఊరు కూడా బావుండాలని కోరుకోవాలి.

– శ్రీదేవి కవికొండల

ఆశలు మోసులెత్తే కాలం

నూతన సంవత్సరం... అనగానే ఏదో ఉత్సుకత, ఆతృత, ఉద్వేగం... కానీ గడిచిన సంవత్సరానికి, రాబోయే సంవత్సరానికి పెద్ద మార్పేమీ ఉండదు. డిసెంబర్ 31 తారీఖు అర్థరాత్రి పన్నెండు గంటల తర్వాత కొత్త సంవత్సరం 2015 వస్తోంది. క్యాలెండర్ మారిపోతోంది. మన జీవితంలో ఇంకో సంవత్సరం ముగిసిపోతోంది. మరో సంవత్సరంలోకి అడుగు పెట్టబోతున్నాం. ఈ సంవత్సరంలో కొత్తగా నేర్చుకున్నవి ఎన్నో ఉన్నాయి. కొన్ని గుర్తుపెట్టుకునేవి, మరికొన్ని మర్చిపోవాల్సినవి, ఇంకొన్ని మర్చిపోదామన్నా మర్చిపోలేని సంఘటనలు మన మదిలో నిండిపోయాయి. కొన్ని మధుర స్మృతులుగా మిగిలిపోతే, కొన్ని విషాదాన్ని నింపాయి.

ఏడెనిమిదేళ్ళ చిన్నారిని ఈ సారి న్యూ ఇయర్‌ని ఎలా సెలబ్రేట్ చేసుకుందాం అంటే ఠక్కున కేక్ కోసుకుందాం. స్వీట్స్ తెచ్చుకుని ఫ్రెండ్స్ అందరితో కలిసి ఎంజాయ్ చేద్దాం అంటుంది. తీరా ఆ సమయం వచ్చే సరికి ఆడి, పాడి అలసిపోయి రాత్రి పదకొండు గంటలకే నిద్రపోతుంది. అదే పద్దెనిమిది, ఇరవయ్యేళ్ళ వయసులో ఉన్న పిల్లల్ని కదిలిస్తే వాళ్ల ఇంట్లో వాళ్లతో కలిసి సరదాగా గడుపుదామని చస్తే చెప్పరు. ఫ్రెండ్స్ అందరం కలిసి పార్టీ చేసుకోవాలనుకుంటున్నాం అంటారు. అదే ముప్పై, నలభయ్యేళ్ళ మహిళల్ని కదిలిస్తే అవకాశముంటే బంధుమిత్రులతో కలిసి సరదాగా ఉండాలనుంది అంటారు. లేదంటే టీవీలో బోలెడు ఛానల్స్, వాటిలో లెక్కలేనన్ని ప్రోగ్రాములు. ఒకటి కాకపోతే మరొటి, ఏదో ఒక ఛానెల్ చూస్తూ అర్థరాత్రి 12 గంటలు దాటి రోజు మారే వరకు కాలక్షేపం చేయొచ్చు. ఆ తర్వాత వీలైనంత మందికి కొత్త సంవత్సర శుభాకాంక్షలు చెప్పి పడుకోవచ్చు.... ఇవీ ఇప్పుడు కొత్త సంవత్సరం వేడుకలంటే వినిపించే మాటలు.

ఇక కొత్త సంవత్సరంలో ఏమేం చేయాలనకుంటున్నారంటే చాలా పెద్ద లిస్టే వుంటుంది. సిగరెట్టు, మందు తాగేవారైతే అవి మానేస్తామని, స్టూడెంట్స్ క్లాసులో ర్యాంక్ తెచ్చుకుంటామని, ఆరోగ్య సూత్రాలు పాటించి ఫిట్‌నెస్ పెంచుకోవాలని, ఇక నుంచి జీడిపాకం సీరియళ్లు చూడ్డం మానేయాలని, అప్పులు చేయకూడదని, ఎవరితోనూ గొడవ పడకూడదని, సినిమాలు చూడ్డం తగ్గిస్తానని... ఇలా ప్రతి ఒక్కరూ తమకంటూ ఏదో ఒక లక్ష్యం పెట్టుకుంటారు. అయితే తీసుకున్న నిర్ణయాలని ఎంత వరకు అమలు పరుస్తారన్నదే అసలు విషయం.

'ఈ సంవత్సరం మా బంధు మిత్రులందరి పుట్టిన రోజులు, పెళ్లి రోజులు గుర్తుంచుకుని కచ్చితంగా అందరికీ ఆ రోజు శుభాకాంక్షలు చెప్పాలనుకుంటున్నాను' ఒక స్నేహితురాలు చెప్పిన ఈ మాట వినటానికి ఎంతో హాయిగా అనిపించింది. ఇలాంటి నిర్ణయాలు అమలు చేయడం వల్ల సంతృప్తి, సంతోషంతో పాటు మనకు తెలియకుండానే అవతలి వారికి సంతోషంతో కూడిన సర్‌ప్రైజ్ ఇచ్చినవారమౌతాం. ఇద్దరు, ముగ్గురో కాదు.. బంధుమిత్రులంటే చాలామంది ఉంటారు... అంతమందికి సంబంధించిన ముఖ్యమైన రోజులు గుర్తుపెట్టుకోవడమంటే మాటలు కాదు.. కానీ మనసుంటే మార్గముంటుందంటారు. దీనికి తను ఎంచుకున్న మార్గం క్యాలెండర్, పెన్ను, పేపర్ తీసుకుని ఒక్కొక్కరి పేరు, వారికి సంబంధించిన పుట్టిన రోజు, పెళ్లి రోజును పేపర్ మీద రాసుకుంటూ, క్యాలెండర్‌లో అవే తారీకుల మీద వారి పేరు, వివరాలు షార్ట్ కట్‌లో మార్క్ చేసింది. ఇలా క్యాలెండర్‌లో గుర్తు పెట్టడం వల్ల, మనం మర్చిపోయినా క్యాలెండర్ చూడగానే గుర్తుకొస్తుంది. ఇదే పద్ధతి గత సంవత్సరం చేయడం వల్ల తనకు వాళ్లందరిలో మంచి పేరు వచ్చిందని కూడా చెప్తోంది. నిజమే అన్ని సందర్భాల్లో అందరితో ముఖాముఖి వెళ్లి కలవడం కుదరదు. కానీ ఇలా ఫోన్‌లో నైనా శుభాకాంక్షలు చెప్పడం వల్ల వాళ్లని గుర్తుపెట్టుకున్నామన్న విషయం అవతలి వారిని సంతోషంగా ఉండేట్లు చేస్తుంది.

నాంది...

నూతన సంవత్సర వేడుకలకు ప్రాచీన కాలంనుండే జరుపుకుంటున్నారనేందుకు ఆధారాలున్నాయి. మొట్టమొదటి కొత్త సంవత్సర వేడుకలు క్రీ.పూ రెండు వేల సంవత్సరాల క్రితమే ప్రాచీన బాబిలోనియన్లు జరుపుకున్నారు. అప్పట్లో వసంత రుతువు ప్రారంభమైన రోజునే కొత్త సంవత్సర వేడుకలు జరుపుకునేవారు. అక్కడ రాజు మారినప్పుడల్లా క్యాలెండర్లు మారేవి. ఫలితంగా వేడుకలు జరుపుకునే రోజూ మారుతూ వచ్చింది.

కొత్త ఒరవడితో...

నిజానికి ఓ దశాబ్దం క్రితం కంటే ఇప్పుడు నూతన సంవత్సర వేడుకలు కొత్త పుంతలు తొక్కాయి. ఉత్సాహం ఉరకలేస్తోంది. పార్టీ కల్చర్ పెరిగిపోయింది. ప్రత్యేక కార్యక్రమాలు, ఆటపాటలతో సమయాన్ని కూడా మర్చిపోతున్నారు.

కంప్యూటర్‌తో ఎన్ని ఉపయోగాలున్నా ఒక్కోసారి వీటితో విసుగూ వస్తుంది. అలా విసుగు వచ్చే సందర్భాల్లో కొత్త సంవత్సరానికి శుభాకాంక్షలు చెప్పేదీ ఒకటి. ఎందుకంటే గతంలోలా నూతన సంవత్సరానికి గ్రీటింగ్ కార్డులు కొని, అందులో స్వ దస్తూరితో శుభాకాంక్షలు రాయడం, అభినందనలు తెలియజేస్తూ స్నేహితులందరికీ అందివ్వడం, దూర ప్రాంతాల వారికి అడ్రస్ రాసి పోస్టులో పంపించడం... ఇదంతా ఎంతో

ఉత్సాహంగా ఉండేది. ఈ విషయంలో పిల్లలే కాదు పెద్దవారూ సందడి చేసేవారు. ఒకరి కంటే మరొకరు తామే ముందుగా శుభాకాంక్షలు చెప్పాలనే ఆత్రుత కనిపించేది. ఇప్పుడంతా నెట్‌లోనో సెల్‌ఫోన్లలోనో రెడీమేడ్‌గా ఉన్న ఎస్సెమ్మెస్‌లు ఒక్క క్లిక్‌తో అవతలి వారికి చేరిపోతున్నాయి. లేదంటే ఆన్‌లైన్ గ్రీటింగ్ కార్డులు పంపించడమే.

అతి అనర్థం...

నూతన సంవత్సరంలో తీసుకున్న నిర్ణయాలని చెప్పమంటే కొంతమంది లిస్ట్ చదివేస్తుంటారు. ఒకటి, రెండు అంతగా అయితే మూడు... అంతకంటే ఎక్కువ నిర్ణయాలు తీసుకుంటే వాటిని అమలు చేయడం కష్టసాధ్యం. ఎవరి మీద వారికి ఎంత పని చేయగలమనే విషయంలో ఓ అంచనా ఉంటుంది. దానికిమించి చేయాలనుకోవడం కూడా నష్టానికే దారి తీస్తుంది. ఎక్కువ నిర్ణయాలు తీసుకుని, అన్నిటిమీదా దృష్టి పెట్టి, వాటిలో దేన్నీ సంపూర్ణంగా నెరవేర్చలేక బాధ పడేకన్నా తక్కువ నిర్ణయాలు తీసుకుని వాటిని పర్‌ఫెక్ట్‌గా అమలుచేస్తే ఆ ఆనందం మాటల్లో చెప్పలేం.

సాధారణంగా నూతన సంవత్సరంలో తీసుకునే కొత్త నిర్ణయాలు ఎంత తొందరగా తీసుకుంటారో అంతే తొందరగా మర్చిపోతుంటారు. అలా మర్చిపోయే వాటిలో బరువు తగ్గడం, ఆరోగ్యం సూత్రాలు పాటించడం, పొగ తాగే అలవాటు మానేయడం, ఏదైనా కొత్తగా నేర్చుకోవాలనుకున్నవి, జంక్ ఫుడ్ మానేయడం, పొదుపు సూత్రాలు పాటించడం, కుటుంబ సభ్యులకు ఎక్కువ సమయం కేటాయించాలనుకోవడం, కొత్త ప్రదేశాలు చూడాలనుకోవడం, ఒత్తిడి తగ్గించుకోవడం, వ్యాయామం చేయాలనుకోవడం లాంటివి ముందుంటాయి.

అనుకరణ వద్దు

ఎవరైనా గానీ కొత్త సంవత్సరంలో కొత్తగా ఎవరికి వారు స్వీయాభివృద్ధికి తీసుకునే నిర్ణయాలు మరొకరు చెప్పారనో, ఇంకెవరో ఇవే నిర్ణయాలను ఆచరించి వృద్ధిలోకి వచ్చారనో తీసుకోకూడదు. మనం తీసుకునే నిర్ణయాలను మనం ఎంత వరకు ఆచరణలో పెట్టగలం?, వాటి వల్ల మనకు ఎంత వరకు మేలు జరుగుతుంది? ఆ నిర్ణయాలు తీసుకోవడం వల్ల వచ్చే కష్టనష్టాల ప్రభావాన్ని దృష్టిలో వుంచుకుని, ఆలోచించుకుని నూతన నిర్ణయాలు తీసుకోవాలి.

తీసుకున్న నిర్ణయాల్ని అమలు చేయలేకపోవటానికి అసలు కారణం

దీన్ని పూర్తి చేయగలమా అనే సందేహమే. సందేహం పెట్టుకోకుండా కచ్చితంగా అనుకున్నది చేయగలం అన్న నమ్మకంతో ఉండాలి. ఏదైనా లక్ష్య సాధనకు మన చుట్టూ ఉన్న వారు వారధిగా పనిచేస్తారు. ఇది చాలామంది మర్చిపోయే విషయం.

లక్ష్యాలను సాధించడానికి కూడా కాల పరిమితి ఏర్పరచుకుని, దానికి తగ్గట్టు కృషి చేసి నిర్ణీత గడువు లోపు దాన్ని పూర్తి చేయాలి. ఫలితంగా వచ్చే ఉత్సాహం తర్వాతి సంవత్సరానికి మరికొన్ని నిర్ణయాలు తీసుకోడానికి ఉపయోగపడుతుంది. అయితే మన అభివృద్ధికి ఏ నిర్ణయాలు తీసుకున్నా వాటిని సన్నిహితులకు చెప్పి చేయాలి అంటారు. ఎందుకంటే ఒకవేళ మనం తీసుకున్న నిర్ణయాలు మనం మర్చిపోయినా వారు గుర్తుచేస్తుంటారు కాబట్టి.

గతం గడిచిపోయింది తిరిగి రాదు. భవిష్యత్తు ఇంకా రాలేదు. ఎలా ఉంటుందో తెలీదు. మన చేతిలో ఉన్నది మాత్రం వర్తమానమే. దాన్ని ఎప్పుడూ నిర్లక్ష్యం చేయకూడదు. సాధారణంగా చాలామంది చేసేది దీనికి భిన్నంగా వుంటుంది. ఇలా జరిగి వుంటే బాగుండేది, అలా ఎందుకు జరిగింది? అప్పుడలా జరగకపోతే ఎంత బాగుండేది?... ఇలా ఎప్పుడూ గతాన్ని తలచుకుంటూ, జరిగిపోయిన సంఘటనలను పదే పదే గుర్తుచేసుకుంటూ బాధపడిపోతుంటారు. ఈ ఆలోచనలకు మొదలు, తుదంటూ ఏమీ ఉండదు. ఇలా ఆలోచిస్తుంటే రోజులు, వారాలు, నెలలు గడిచిపోతూనే ఉంటాయి.

మరికొందరు భవిష్యత్తులోని బంగారు జీవితం గురించి ఊహాలోకాల్లో విహరిస్తూ వర్తమానాన్ని విస్మరిస్తుంటారు. అలాగే రోజులు వెళ్ళబుచ్చుతుంటారు.

ఈ రెండు పద్ధతుల వల్ల ఒరిగేది ఏమీ వుండదు. గతాన్ని గుర్తు చేసుకుంటూ కాలం వెళ్ళబుచ్చినా, భవిష్యత్తులో ఊహల్లో విహరించినా వర్తమానాన్ని గురించిన ఆలోచన దూరమవుతుంది. చూస్తుండగానే వచ్చిన అవకాశాలు చేజారిపోతాయి. జీవితపు పరుగులో వెనుకబడిపోతాం.

మన చేతుల్లోలేని, మార్చలేని గతాన్ని, నిర్ణయించలేని భవిష్యత్తును పక్కన పెట్టి వర్తమానంపై దృష్టి పెడితే ఎలాంటి లక్ష్యాన్నైనా సాధించొచ్చు. వాస్తవానికి దగ్గరగా ఉండేది వర్తమానమే. దాన్ని పక్కన పెడితే చేతిలోకి వచ్చిన అవకాశాన్ని చేతులారా చేజార్చుకున్నట్లవుతుంది.

ఇప్పటికే తీసుకున్న నిర్ణయాలకు పాటిస్తామన్న మాటకు కట్టుబడి ఉండడమే అసలైన నిర్ణయం. వాటితో పాటు కొత్త ఆశలతో, లక్ష్యాలతో అవి నెరవేర్చుకునే దిశగా అడుగులు వేస్తూ ముందుకు సాగుదాం.

- బి.మల్లేశ్వరి



నెమలీక



వెంగళప్ప తెలివి



ఒక పల్లెటూర్లో ఒక అమాయకుడు ఉండేవాడు. అతణ్ణి అందరూ వెంగళప్ప అని పిలిచేవారు. ఒక రోజు అతను పొరుగూరికి వెళ్లి వస్తున్నాడు. దారిలోనే చీకటి పండింది. ఆ రోజు పౌర్ణమి. బాగా నడవడం వల్ల వెంగళప్పకి దాహంగా వుంది. ఒళ్లంతా చెమట పట్టింది. దారిలో అతనికి ఒక చోట ఒక చేదబావి కనిపించింది. కాళ్లు చేతులు కడుక్కుని కొంచెం నీళు తాగుదామని ఆ బావి దగ్గర ఉన్న బక్కెట్‌ని నీళ్లలో వేశాడు. బక్కెట్ నిండా నీళ్లునింపి పైకి లాగి దాన్ని అందుకోబోతుంటే నీళ్లలో చంద్రుని ప్రతిబింబం కనిపించింది.

"అయ్యో చంద్రుడు బావిలో పడిపోయాడు, ఇప్పుడెట్లా? చంద్రుడు లేకుంటే వెన్నెల ఎక్కడి నుంచి వస్తుంది? పైగా నీళ్ళల్లో తడిస్తే చంద్రుడికి జలుబు కూడా చేస్తుంది" అనుకున్నాడు.

చంద్రుణ్ణి బావిలోనుండి బయటికి తీయాలని బావిలోని నీళ్లని బక్కెట్‌తో తోడి పోస్తూ ఉన్నాడు. అలా చాలా సేపు చేశాడు. చీకిపోయిన తాడు తెగి బక్కెట్ బావిలో పడిపోయింది. తాడు లాగుతున్న వెంగళప్ప వెనక్కి పడిపోయాడు. వెల్లికిలా పడిపోయిన వెంగళప్పకి ఆకాశంలో చంద్రుడు కనిపించాడు. దాన్ని చూడగానే "హమ్మయ్యా! చంద్రుడికి ఏమీ కాలేదు. నేను చంద్రుణ్ణి కాపాడగలిగాను. అందరికీ వెన్నెల వచ్చేలా చేశాను. ఈ విషయం ఊళ్లోకెళ్లి చెప్తే నన్ను అందరూ

మెచ్చుకుంటారు. ముందు ఆ పని చేయాలి" అనుకుంటూ ఇంటి దారి పట్టాడు వెర్రి వెంగళప్ప.

రంగులతో కొత్త సంవత్సరం

ఈ బొమ్మను రంగులతో నింపి
కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుదాం.

ఎన్ని ఉన్నాయి?

కొత్త సంవత్సరం 2015 అనే అంకె ఇక్కడ ఎన్ని సార్లు ఉందో లెక్కపెట్టండి.

పీఠభూములు

1. టిబెట్ పీఠభూమి : ప్రపంచంలో ఎక్కువగా వ్యాపించి ఉన్న పీఠభూమి ఇది. హిమాలయాలు, కున్‌లున్ పంక్తుల మధ్య ఉంది.
2. లార్సెన్షియా పీఠభూమి : కెనడా ఉత్తర, తూర్పు ప్రాంతంలో ఉన్న ఖండాంతర పీఠభూమి. ఇక్కడ ఖనిజ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయి.
3. కొలంబియా పీఠభూమి : రాకీస్, కాకసన్ పంక్తి మధ్య వున్న అగ్నిపర్వత పీఠభూమి.
4. మెక్సికన్ పీఠభూమి : మెక్సికోలో వున్న పర్వతాల మధ్య ఉంది.
5. బొలీవియా పీఠభూమి : బొలీవియాలోని డయాట్రోఫిక్ పీఠభూమి. ఈ ప్రదేశం తగరానికి ప్రసిద్ధి.
6. మాటోగ్రాసో పీఠభూమి : బ్రెజిల్‌లో వుంది. బంగారు, వజ్రాల ఉత్పత్తికి కేంద్రం.
7. పామిర్ పీఠభూమి : హిమాలయాల దగ్గర ఉంది. దీన్నే 'రూఫ్ ఆఫ్ ది వరల్డ్' అని కూడా అంటారు.
8. స్పెయిన్ పీఠభూమి : ద్వీపకల్ప స్పెయిన్‌లో క్రమక్షయానికి గురవుతున్న పీఠభూమి.

రోజుకు పదహారు గంటలు

- ఏనుగులు రెండు రకాలు. 1. ఆసియా ఏనుగులు, 2. ఆఫ్రికా ఏనుగులు.
- ప్రపంచంలో నేలమీద నివసించే క్షీరదాల్లో ఏనుగు పెద్దది.
- ఆఫ్రికా ఏనుగులలో ఆడ, మగ ఏనుగులకు దంతాలుంటాయి కానీ, ఆసియా ఏనుగుల్లో మగ ఏనుగులకే దంతం ఉంటుంది.
- ఏనుగుపిల్ల తల్లి కడుపులో 22 నెలలు ఉంటుంది.
- పెద్ద ఏనుగుకు రోజుకు 210 లీటర్లు నీళ్లు అవసరమవుతుంది.
- ఉష్ణోగ్రత బాగా ఎక్కువగా ఉన్నప్పుడు ఏనుగుకు చెవులలో ఉండే రక్త నాళాలు ఆ ఉష్ణోగ్రతని క్రమబద్ధం చేస్తాయి.
- ఏనుగు తొండం రెండు మీటర్ల పొడవు, బరువు 140 కిలోల వరకు ఉంటుంది. ఈ తొండంలో లక్ష కండరాలు ఉంటాయి.
- ఏనుగు నీళ్ళల్లో ఈదగలదు. పూర్తిగా నీళ్లల్లో మునిగినప్పుడు తొండం ద్వారా శ్వాస పీలుస్తుంది.
- ఏనుగులు శాఖాహారులు. రోజుకు పదహారు గంటలు ఆహార సేకరణ కోసం కేటాయిస్తుంది.



పదాలు పట్టుకోండి

E	E	K	V	B	G	S	Z	J	C	S	S	Z	G	A
T	V	A	J	W	P	X	A	C	N	R	D	K	C	P
A	E	U	F	M	H	H	O	O	E	R	K	K	S	P
R	S	R	Q	G	E	U	I	M	L	I	J	N	J	E
B	R	F	H	D	N	T	A	J	S	L	H	G	Z	T
E	A	Z	Y	T	U	E	X	S	A	K	U	I	K	I
L	E	G	D	L	R	O	K	J	X	N	D	G	D	Z
E	Y	O	O	T	I	M	E	S	S	Q	U	A	R	E
C	W	S	S	S	P	P	E	P	E	N	U	A	Z	R
N	E	Q	M	B	Y	W	S	M	A	O	R	M	R	S
R	N	F	O	Y	C	J	G	U	V	W	E	Q	K	Y
H	U	T	O	N	A	J	Z	S	K	D	Z	N	E	X
Q	T	X	Q	T	V	A	T	I	I	M	Y	L	E	N
E	G	N	A	P	M	A	H	C	G	P	X	F	V	A
H	C	O	N	F	E	T	T	I	M	Z	Y	U	P	U

APPETIZERS
CELEBRATE
CHAMPANGE
CONFETTI
COUNT DOWN
KISS
MUSIC
NEW YEARS EVE
RESOLUTIONS
STREAMERS

ఈ అక్షరాల గుంపులో కిందున్న నూతన సంవత్సరానికి సబంధించిన పదాలు దాగున్నాయి. వాటిని వెతికి పట్టుకోండి.



బూర ఏది?

రాబోయే సంవత్సరానికి సంబంధించిన బూర ఏదో కనుక్కోండి.

■ సీరియల్

ప్రేమ - విప్లవం

మూలం : మేరీ గాబ్రియేల్

స్వేచ్ఛానువాదం: **ముక్తవరం పార్థసారథి,** ఫోన్: **91776 18708**

(గతవారం తరువాయి)

బ్రసెల్స్, 1848

జర్మన్ వర్కర్స్ యూనియన్ నిర్వహించిన కొత్త సంవత్సరం వేడుకల్లో పాల్గొన్నారు మార్క్స్, జెన్నీ. (వీటి నిర్వహణలో జెన్నీ కూడా పాలు పంచుకుంది). ఇటీవల ఆమె జీవితంలో సంతోషమే లేకుండా పోయింది. భర్త గురించి ఎప్పుడూ బెంగే. దీనికి తోడు మార్క్స్ లండన్‌లో ఉన్నప్పుడు ఇంట్లో అందరూ మంచం పట్టారు. తను పద్నాలుగు రోజులు లేవలేదు. కొత్త సంవత్సరం నాటికి పరిస్థితి కాస్త మెరుగు పడింది. పిల్లలు కోలుకున్నారు. ఆర్థిక పరిస్థితి కూడా ఆశాజనకంగా కనిపించింది. మార్క్స్ తల్లి ఆస్తిలో కొంత వాటా ఇచ్చేస్తానంది.

అలా డిసెంబర్ 31 నాడు, విప్లవానికి కాసేపు విశ్రాంతి నిచ్చి అందరూ ఉల్లాసంగా గడిపారు. అనేక సంవత్సరాల తర్వాత, మళ్లీ బాల్ డాన్స్ చేసింది జెన్నీ. ఆ సాయంత్రం అదో రంగుల ప్రపంచం. ఊదా, పసుపు, ఆకుపచ్చ, ఎరుపు రంగుల సిల్కు గౌనులు, వేడుక హాల్లోని గ్యాసులైట్ల వెలుగులో తళుక్కుమన్నాయి. నాట్యం మధ్యలోనే కొందరు ఉపన్యాసాలిచ్చారు. బెల్జియం రాజ్యాంగం ఉదారవాద భావాలను, స్వేచ్ఛను సమర్థిస్తోంది. ఈ నేలలో మానవత్వ బీజం మొక్కగా ఎదుగుతోంది అన్నాడు మార్క్స్. జెన్నీ నాటక ప్రదర్శనలో పాల్గొంది. రాత్రంతా కొనసాగింది ఉత్సవం.

మార్క్స్ ఆ రోజు నాట్యంలో పాల్గొని తనకందులో ప్రవేశం ఉందని నిరూపించుకున్నాడు. దంపతులిద్దరూ కలసి చేసిన నాట్యం చాలా మందిని ఆకర్షించింది. రైన్‌లాండ్‌లో ఇలాంటి సందర్భాల్లో, ఉన్నత వర్గాల వాళ్లూ, కార్మికులూ దూరదూరంగా ఉండాలని మధ్యలో ఓ తాడు కడతారు. ఇక్కడ అలాంటి విభజన లేదు.

పెళ్లయిన నాటి నుండీ జెన్నీని ఆర్థిక అభద్రతా భావం వెంటాడుతూనే ఉంది. దానితో పాటు స్వదేశానికి దూరంగా ఉండటం మరో బెంగ. పిల్లల అనారోగ్యం, భర్త అనుభవిస్తున్న రాజకీయ వేధింపులు కూడా ఆమెను కుంగతీశాయి. అయినా ఆ సాయంత్రం ఆమె ఆనందానికి అవేమీ అడ్డు రాలేదు. తానింకా పెళ్లికాని పద్దెనిమిదేళ్ల అరిస్టోక్రాటిక్ యువతి అన్నట్టుగానే ఠీవి ప్రదర్శించింది.

ఆ నాట్యానికి మేరీబర్న్సును వెంట తీసుకొచ్చాడు ఎంగెల్స్. అందరూ ఉల్లాసంగానే ఉన్నా, ఆమెకూ, జెన్నీకి వున్న వ్యత్యాసం స్పష్టంగా కనిపించింది. "జెన్నీకి అసలామెను పలకరించే ఉద్దేశమే లేదని మార్క్స్ చెప్పాడు" అన్నాడు స్టెఫాన్ బార్న్ (కమ్యూనిస్ట్ లీగ్ సభ్యుడు). అయితే ఇది జెన్నీ అహంకారం కాకపోవచ్చు. అంతమంది పేదవాళ్ల మధ్యకు తను పెళ్లి చేసుకోని స్త్రీని తీసుకురావటం వాళ్లకు నచ్చి ఉండకపోవచ్చు. ధనికులు పేద ఆడపిల్లల్ని ఆటవస్తువుల్లా వాడుకుంటున్నారని అనుకుంటారు వాళ్లు.

జనవరిలో 'మేనిఫెస్టో' రచన పూర్తి చెయ్యటానికి మార్క్సును ఒంటరిగా వదిలింది జెన్నీ. అప్పటికే మూడు ముసాయిదాలు పూర్తయ్యాయి. రెండు ఎంగెల్స్, ఒకటి హెస్ రాశారు. అవేవీ తృప్తి నివ్వలేదు మార్క్సుకు. 'మళ్లీ రాయాల్సిందే అనుకున్నాడు. పని తొందరగా ముగియటానికి, జెన్నీ సహాయం చేస్తానంది. మార్క్స్ తన గజిబిజి రాత కొనసాగించాడు. దాన్ని జెన్నీ అందమైన దస్తూరితో తిరగరాసింది. బూర్జువా వర్గాన్ని అంతగా అభిశంసించిన రచన చరిత్రలో మరొకటి లేదు. విప్లవం అనివార్యం అన్నారు. కావచ్చు కాని, ఎప్పటిలాగే పని పూర్తి చెయ్యటానికి మార్క్సుకు మరెన్నో పనులు అడ్డుపడ్డాయి. 'డాయిష్ బ్రసెలర్'కు వ్యాసాలు రాయాలి. 'జర్మన్ వర్కర్స్ యూనియన్' కోసం ఉపన్యాసాలు తయారు చెయ్యాలి (వీటిని పుస్తకంగా సంకలనం చెయ్యాలనుకున్నాడు). ఇంటర్నేషనల్ డెమోక్రాటిక్ అసోసియేషన్ సమావేశాలకు హాజరు కావాలి (ఇందులో భాగంగా బెల్జియంలోని పారిశ్రామిక నగరం ఘెంట్‌లో కూడా అసోసియేషన్ శాఖను ప్రారంభించాలి). వాటితో పాటు జనవరిలో, స్వేచ్ఛా వాణిజ్యం గురించి కూడా ఉపన్యసించాడు.

స్వేచ్ఛా వాణిజ్యం రాజరికంలాగా సహజమైంది అంటారు కొందరు. (వాళ్ల దైవాంశ సంభూతులు. అది దైవాజ్ఞ) వాణిజ్యం వల్ల జనం మధ్య దూరం తగ్గుతుంది. సాన్నిహిత్యం పెరుగుతుంది. ఒక చరిత్రకారుడు చెప్పినట్టుగా "నాగరికత అందించిన వరాలు అందరికీ అందుతాయి". కాని "పెట్టుబడికి స్వేచ్ఛ ఇవ్వటమంటే, కార్మికులను అణచి వెయ్యటానికి స్వేచ్ఛ యివ్వటమే" అన్నాడు మార్క్స్. అయితే ఒకరకంగా ఇది అభిలషణీయమే. పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయి. సామాజిక మార్పు వేగవంతమవుతుంది. ప్రపంచం – ధనిక బూర్జువా – కార్మిక వర్గాలుగా చీలిపోతుంది. ("వారసత్వంగా వచ్చిన సంపద ఒకవైపు – వారసత్వంగా వచ్చిన పేదరికం ఒకవైపు" అన్నాడు ఎంగెల్స్) స్వేచ్ఛావాణిజ్యంతో ప్రస్తుత వ్యవస్థ తొందరగా అదుపు తప్పుతుంది. ఆర్థిక సంక్షోభం తలెత్తుతుంది. విప్లవం అనివార్యం అవుతుంది.

కార్మికులకు శాపం లాంటి స్వేచ్ఛా వాణిజ్యాన్ని వ్యతిరేకించటానికి

బదులు, ఆహ్వానించినందుకు కొందరు మార్క్స్‌ను తప్పు పట్టారు. కాని అపరిపక్వ దశలో విప్లవం సఫలం కాదు అన్నాడు మార్క్స్. కొద్దిమంది కాదు, అధిక సంఖ్యాకులు విప్లవ ఆవశ్యకతను గుర్తించినప్పుడే దానికి దారి సుగమం అవుతుంది (స్వేచ్ఛా వాణిజ్యం వల్ల ఈ మార్పులన్నీ త్వరితగతిన సంభవిస్తాయి). హింస ద్వారా అధికారం హస్తగతమవుతుందేమోగాని కార్మిక వర్గ ప్రయోజనాలు నెరవేరవు.

మార్క్స్ తన స్వేచ్ఛా వాణిజ్య సిద్ధాంతాన్ని బ్రసెల్స్‌లోని ఆర్థికవేత్తలకు సెప్టెంబర్‌లో వినిపిద్దామనుకున్నాడు గాని వీలుపడలేదు. అయితే, అది వృథాగా పోలేదు. 'కమ్యూనిస్ట్ మేనిఫెస్టో'లో అది ప్రతిఫలించింది.

పారిస్‌లో ఉన్న ఎంగెల్స్, అక్కడి లీగ్ సభ్యులు సంస్థ కార్యకలాపాలలో ఉత్సాహం చూపటం లేదని రాశాడు. దానికి కారణం, లండన్ సమావేశాలు తాము ఆశించిన ఫలితాలు ఇవ్వకపోవడమే. యూరోపియన్ రాజకీయాల్లో పెను మార్పులు సంభవిస్తున్నా లండన్ సమావేశాల్లో అవి ప్రతిఫలించలేదు. అప్పటికే 'మేనిఫెస్టో' రచించబోతున్న మార్క్స్‌కు ఇదో హెచ్చరికలా పని చేసింది. ఇది సరిపోదన్నట్టు, ఫిబ్రవరి 2 నాటికి మేనిఫెస్టో తమకు చేరకపోతే, "మీ మీద తదుపరి చర్యలు తీసుకోబడతాయి" అంటూ జనవరి 26 నాడు ఒక అల్టిమేటం పంపింది లీగ్ ."

నిజానికి మార్క్స్ అప్పటికే రచన ముగించాడు. జనవరి చివరలో ఈ 23 పేజీల డాక్యుమెంట్‌ని లండన్‌కు పోస్టు చేశాడు. లండన్ నగరంలోని లివర్‌పూల్ స్ట్రీట్‌లో ఉన్న జె.ఇ.బర్గార్ అనబడే జర్మన్ ప్రింటర్ ముదురు ఆకుపచ్చరంగు కవర్‌తో దాన్ని ముద్రించారు. పేరు " మేనిఫెస్టో ఆఫ్ ది కమ్యూనిస్ట్ పార్టీ" (అప్పటి వరకూ ఆ పేరుతో ఏ పార్టీ లేదు) ఫిబ్రవరి 1848 నాటికి ఎనిమిది వందల ప్రతులు అచ్చయ్యాయి. పుస్తకం మీద రచయిత పేరు కనిపించదు. ఇంగ్లీష్ చార్టిస్ట్ నాయకుడు జార్జి జూలియన్ హార్నీ దీన్ని "ప్రపంచంలోని అత్యంత విప్లవాత్మక డాక్యుమెంట్" అన్నాడు.

'మేనిఫెస్టో' రచనలో గొప్ప బిగువు వుంటుంది. పైకి ప్రశాంతంగా కనిపించినా అడుగున బడబాగ్నులు దాగున్నాయనిపిస్తుంది. మొదటి వాక్యమే – కోర్టులో కేసు వాదిస్తున్నట్టుగా ప్రారంభమవుతుంది (ఒకప్పుడు మార్క్స్ లాయర్ కావాలనుకున్నాడు) "యూరోప్‌ను ఒక భూతం ఆవహించింది. కమ్యూనిస్టు భూతం"

ఆ తర్వాత బూర్జువా వర్గం చేసిన నేరాలను ఒకటొకటిగా వర్ణిస్తాడు. "స్వప్రయోజనం, స్వార్థం, డబ్బు యివ్వటం, తీసుకోవటం తప్ప మనిషికీ మనిషికీ మధ్య మరే సంబంధమూ లేకుండా పోయింది. "డాక్టర్లు, లాయర్లు, ప్రీస్టులు, కవులు, శాస్త్రజ్ఞులు వంటి గౌరవప్రదమైన వృత్తుల వాళ్లను కూడా, కేవలం డబ్బుల కోసం పనిచేసే కూలీలుగా మార్చింది. కుటుంబ సంబంధాలను ఆర్థిక సంబంధాలుగా మార్చింది. "పెట్టుబడి సృష్టించిన ఈ సంక్షోభం ప్రపంచంలోనే అపూర్వం. ఉత్పత్తి విధానాలను విప్లవీకరించి, తద్వారా అదనపు లాభాలను మూటగట్టుకోవాలనుకోవడమే దీనికి కారణం – లాభాలు రావాలంటే వాణిజ్యం ప్రపంచమంతా విస్తరించాలి. అంటే వాణిజ్యం జరగని చోటంటూ ఎక్కడా ఉండకూడదు. ఈ పద్ధతిలో దూరదేశాల ముడిసరుకులు స్టీం షిప్పుల్లో, రైళ్లలో పరిశ్రమలకు చేరాయి. పాతతరం జాతీయ పరిశ్రమలు నాశనమయ్యాయి. పారిశ్రామిక సాలెగూడులో చిక్కుకున్న పాత నాగరికతలు కూడా కనుమరుగైనాయి. దీన్ని గురించి మార్క్స్ సంక్షిప్తంగా "ఈ వ్యవస్థ తన రూపంలో కొన్ని పున: నిర్మించుకుంటుంది" అన్నాడు.

"అంతేకాదు సమాజం విధ్వంస బీజాలను కూడా తనలోనే నిక్షిప్తం చేసుకుంది. క్షుద్రశక్తులను ఆవాహన చేస్తే అవి ఆ మంత్రగాణ్ణే కబళించినట్టుగా" అని కూడా వివరించాడు. వ్యాపార సంక్షోభాలు ఉత్పత్తిని అనివార్యంగా పెంచుతాయి. ఈ పారిశ్రామిక అభివృద్ధికి కారణమైన కార్మిక సైన్యమే కొత్త వ్యవస్థను తుదముట్టిస్తుంది. అందువల్ల బూర్జువా వర్గం ఇతర వస్తువులను ఎన్ని ఉత్పత్తి చేసినా, అన్నింటి కన్నా ముఖ్యంగా అది తన సమాధి తవ్వేవాళ్లను ఉత్పత్తి చేస్తుంది. "బూర్జువా వ్యవస్థ పతనం – కార్మికవర్గ విజయం అనివార్యం" చారిత్రక పరిణామ క్రమంలో ఇది తప్పనిసరి" అన్నాడు మార్క్స్.

కమ్యూనిజానికి ప్రాతిపదిక సొంత ఆస్తిని నిషేధించటమే. కొందరు విమర్శకులు ఆందోళన వ్యక్తం చేస్తే : పదింట తొమ్మిది మందికి ఏ ఆస్తీ లేదు. అందువల్ల పోగొట్టుకునే వాళ్లు ఎవరైనా ఉన్నారంటే, అదంతా వాళు దోపిడీ చేసి సంపాదించిందే" అని వివరణ ఇచ్చాడు. "సమాజంలోని వనరుల మీద అందరికీ హక్కు కల్పిస్తుంది కమ్యూనిజం. ఈ విషయంలో

ఎవరి పట్లా వివక్ష చూపదు. కాకపోతే శ్రమ దోపిడీని అది అరికడుతుంది. ఎవరికీ మరొకరి శ్రమ మీద అధికారముండదు. వందమందో, లక్షమందో కలిసి ఒక పరిశ్రమలో సంపద సృష్టిస్తే ఆ లాభమంతా కొద్దిమందికి మాత్రమే ఎందుకు దక్కుతుంది? ప్రకృతి మానవునికి ప్రసాదించిన వరాలు...ప్రకృతి వనరులు, ఖనిజాలు, సముద్రాలు ఇలాంటివన్నీ కొద్ది మంది అధీనంలో ఎందుకుండాలి?"

"కుటుంబ వ్యవస్థకే ప్రమాదకరంగా పరిణమిస్తుంది కమ్యూనిజం" అని విమర్శించేవాళ్లవి ద్వంద్వ విలువలన్నాడు మార్క్స్. "ఇప్పటికే బూర్జువా పారిశ్రామిక వ్యవస్థలో బాల కార్మికులు బాల్యాన్ని కోల్పోతున్నారు. విద్యాబుద్ధులకు దూరం చేసి, వాళ్లను కేవలం వ్యాపార సరుకుగా, వాళ్ళ శ్రమను దోపిడీ చెయ్యటానికి మాత్రమే వాడుకుంటున్నారు". ఇక, ధనికవర్గాలు వైవాహిక వ్యవస్థను ఇప్పటికే నాశనం చేశాయి. పేదల భార్యలనూ, కూతుళ్లనూ డబ్బాశ చూపి, పడుపు కత్తెలుగా మార్చుతున్నారు. ధనిక వర్గాలలో 'భార్యల మార్పిడి' ఒక క్రీడగా మారింది.

"వర్గాలూ, వర్గ వైషమ్యాలతో కుళ్లిపోయిన బూర్జువా సమాజం స్థానంలో కొత్త సమాజాన్ని ఏర్పర్చుకుందాం. అక్కడ ఒకరి బాగు అందరి బాగుగా ఉంటుంది. ఒకరి అభివృద్ధి అందరి అభివృద్ధిగా వుంటుంది." కాని ప్రస్తుత సామాజిక వ్యవస్థను "బల ప్రయోగంతో కూల్చినప్పుడే ఇది సాధ్యపడుతుంది. కమ్యూనిస్టు విప్లవ గర్జనకు అధికార వర్గాలు గజగజా వణకనీ!" కార్మికులు పోగొట్టుకునేదేమీ లేదు. వాళ్లకున్న సంకెళ్ల తప్ప. నూతన ప్రపంచాన్ని తప్పక గెలుచుకుంటారు!

"ప్రపంచ కార్మికులారా, ఏకం కండి!"

(సశేషం)

■ కథ : మన్నె ఏలియా

బద్నామ్

దట్టమైన పచ్చని చెట్లతో అందంగా అలంకరింపబడిన ఎత్తైన గుట్టలు, గుట్టలను చీల్చుకుంటూ గలగల పారే సెలయేర్లు, ఇరువైపులనున్న చెట్లపై పైనున్న పక్షుల గుసగుసలు వాటి గోస, వాటి భాష, వాటి యాస మన కర్థం కాకపోయినా వాటి ఉనికిని చాటుకొంటున్నాయి.

విచ్చలవిడిగా పారబోసినట్టున్న ప్రకృతి సౌందర్యమంతా ఇక్కడే రాశిగా పోసిన సుందర దృశ్యాల మణిహారం జోడేఘాట్ సొంతం.

గోండుల హక్కులైన జల్, జంగల్ జమీన్ కోసం వీరోచితంగా పోరాడి, ప్రాణాలు విడిచిన త్యాగ ధనుడు, అమర వీరుడు కొమురం భీం వర్ధంతితో జన సంద్రమైంది గిరి ప్రాంతం. గత కొద్ది రోజులుగా ఏర్పాట్లలో తలమునకలై వుంది జిల్లా ప్రభుత్వ యంత్రాంగం. చుట్టపు చూపుగా విహారయాత్రకు వచ్చినట్టు రాజకీయ నాయకులు, వేలకొలది గోండులు, వందల సంఖ్యలో వాహనాలు, పదుల సంఖ్యలో పత్రికా విలేకర్లు, టీవీ చానళ్ళ ప్రతినిధులు, కవులు, కళాకారులు, గుస్సాడి నృత్యాలు, జానపదాల ఆటపాటలు ధూంధాంగా పండగ వాతావరణం. ఇంకోవైపు అడుగడుగునా పోలీసుల తనిఖీలు.

దూరంగా గుట్టపై నిల్చుండి చూస్తూ "ఏమోయ్ బావా! నువ్వు ముఖ్యమంత్రిని చూడవా?" అడ్గింది పులి.

"నేనా? విచిత్రమైన ప్రశ్న అడ్గితివి బావా! నేనెవర్నీ సూడాలనుకోను. అందరూ నన్నే సూడాలనుకుంటున్నారు. కాదు కాదు నా అంతు చూడాలను కొంటున్నరు. అది వారి వల్ల కాదనుకో"

పులి "నీవేమన్నా వీరుడివా?..మహా శూరుడివా?" వెటకారంగా అన్నది.

"నేను నేనే" సమాధాన మిచ్చిండు.

పులి మళ్ళీ అన్నది "అదేమీ కాదుగాని.. సెక్యూరిటీ ప్రాబ్లమ్ గదా!"

"నాకేమీ సెక్యూరిటీ వద్దు. నాకేమీ భయం లేదు. నేను ఒంటరిగానే వెళ్లగలను. నాకెవరి సాయమూ అవసరం లేదు"

"అయ్యో బావా! నేన్ననది నీకు సెక్యూరిటీ కావాలని కాదు. పోలీస్ వాళ్లు నిన్ను రానివ్వడం లేదా జోడె ఘాట్ సభకు అని?" పులి వివరణ ఇచ్చింది.

"నాకెవర్వి పర్మిషన్ అక్కరలేదు. నేనే వద్దనుకుని పోతలేను. కొద్ది సేపు విశాంత్రి తీసుకుందామని ఇక్కడ సేదతీరుతున్నా. వీళ్లంతా వెళ్లిపోతే నేనే గదా వాళ్లతో వుండేది"

ఇలా మాట్లాడుకుంటూనే పులి "అగో.. చూడు బావ కళాకారుల ఆటపాటలు, తెలంగాణ సంస్కృతి సంబరాలు..." నిక్కినిక్కి చూస్తున్నది.

"ఓ.. అదో గొప్ప విషయమా? మేము తల్చుకుంటే ఒక్కొక్కన్ని భారత నాట్యం, డిస్కోడాన్స్ చేపిస్తం. నన్ను డిస్టబ్బ్ చేయకు బావా! నీకు పున్నెముంటది. రాత్రంతా నిద్రలేదు. అలిసిపోయిన. కొంచెం కునుకుతీస్తా" పక్కకు వెళ్లి పడుకున్నాడు.

ముఖ్యమంత్రి వచ్చేంత వరకు ఆటలు, పాటలు, నృత్యాలు జోరందుకున్నాయి. కొమురం భీం జీవితాన్ని నాటకంగా అద్భుతంగా ప్రదర్శిస్తున్నారు. అక్కడ ప్రజలు, ఇక్కడ పులి ఆసక్తిగా తిలకిస్తుంటే, స్టేజీ ముందు కెమరా స్టాండ్లు పెట్టి ప్రతి దృశ్యాన్నీ రికార్డు చేసుకుంటున్నారు విలేకర్లు.

ఆకాశంలో దడ్‌దడ్‌దడ్... పెద్ద శబ్దంతో హెలికాప్టర్ వచ్చివాలి పోయింది హెలిపాడ్‌లో. అధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు వెళ్లి స్వాగతం పలికి ముఖ్యమంత్రిని కొమురం భీం విగ్రహం వద్దకు తీసుకొచ్చి విగ్రహావిష్కరణ గావింపజేశారు. కొమురం భీం ముఖం కనబడకుండా పూల దండలతో ముంచేశారు. గట్టి భద్రత నడుమ వేదికపైకి వెళ్లాడు ముఖ్యమంత్రి.

"సమ్‌దీర్ కో...రాం..రాం.. చొకడ్ మంతా?" గోండి భాషలో పలకరించి, ఉపన్యాసం ప్రారంభించి, తెలంగాణ యాసలో గోండులకు వరాల వర్షం కురిపించాడు. అందరూ తడ్చి ముద్దయ్యారు. ఆనందంతో చప్పట్లు మారుమోగాయి. గుట్టల మధ్య ప్రతిధ్వనించాయి. కొత్త ఆశలు, ఆలోచన్లు చిగురించాయి. ముఖ్యమంత్రి ప్రసంగం ముగించి, రెండు

చేతులెత్తి అందరికీ దండాలు పెట్టుకుంటూ.. హెలికాప్టర్‌లో వెళ్లిపోయాడు.

"హమ్మయ్య! సభ విజయవంతమైందనుకొని అధికారులు, పోలీసులు, ప్రజలు ఎక్కడి వాళ్లు అక్కడికి వెళ్లి పోయారు. కొద్ది సేపట్లోనే ఎప్పటి లాగే జోడేఘాట్ ప్రాంతమంతా నిశ్శబ్దం ఆవరించింది.

నెమ్మదిగా మేల్కొని "ఏం, బావా! మస్తు హుషార్‌గున్నవ్ ఏంది కథ" అడ్గిండు.

ముఖ్యమంత్రి స్పీచ్ విని మురిసిపోయిన పులి "బావా! మా గోండు మిత్రులకు మంచి రోజులస్తున్నయి. గోండు గూడాల రూపురేఖలు మారనున్నయి. వాళ్ల బతుకులు బాగుపడబోతున్నయి..." ఇలా చెప్పుకుంటు పోతోంది.

"అంత...ఎగ్జైట్ కాకు బావా! నా చిన్నప్పటి నుండి వింటున్న.. ప్రతి ఏటా గిట్లనే ఏదో మంత్రి వస్తుంటడు పోతుంటడు... గీ వరాలు కొత్తవేమి కాదు. ఊదుకాలది, పీరలు లెవ్వయి, మల్ల అచ్చె యాడాది దాక అందరు మర్సిపోతరు. ఇంకో యాట ఎవరో యాదిసేసెదాకా"..

పులి కౌంటర్ వేస్తూ "నువ్వు ఎప్పుడూ నెగటివ్ మాట్లడతవు. నమ్మాలి బావా! నమ్మకమే జీవితం. అందరూ ఒక్క తీరుగుంటరా?".

"నువ్వు నేను ఒక్క తీరు లేమంటే ఒప్పుకుంట, గాని గా రాజకీయ నాయకులు పార్టీలు వేరుగాని బుద్ధి ఒక్కటే బావా! ఈడ ఎండచ్చింది. గా సెట్టు నీడకు కూకోని మాట్లాడుకుందాం పా" అనడంతో ఇద్దరూ పక్కనున్న ఇప్ప చెట్టుకిందికి వెళ్లి సంభాషణ కొనసాగిస్తున్నారు.

పులి మొదలు పెట్టింది. "అవు బావా! నాకెప్పటి నుండో ఒక మాట అడ్గాలని వుంది. ఏమనుకోవుగదా!"

"అడ్గు బావా! అడ్గు కడుపుల దాసుకోకు. కడుపుబ్బుతది"

"ఏ పేపర్ చదివినా, టీవీ జూసినా నీ గురించే వార్తలు, చర్చలు. ఇంత పాపులారిటి ఎట్ల సంపాదిస్తివి."

బక్కగున్నానని తక్కువ చెయ్యకు. గంత పెద్ద ఏనుగు సుగ గజ్జగజ్జ వణుకుతది. అంతెందుకు సర్కార్‌లే దద్దరిల్లుతున్నాయి. ప్రతి పక్షాలోల్లకు నోటి నిండా పని, పత్రికలోల్లకు రాసుకున్నంతా... మా దాటికి తట్టుకోలేక గిరిజనులు పిట్టలు రాలినట్టు రాలుతున్రు"

"అవ్వతోడు నువ్వు సామాన్యునివి కాదు. బావా గిప్పటిదాక ఎంత మందిని వేటాడినవు" అమాయకంగా ప్రశ్నించింది పులి.

"నేను లెక్కల్లో వీక్" అని తెలివిగా తప్పించుకున్నాడు. "నా సంగతెందుకుగని, నువ్వెందర్ని వేటాడినవో చెప్పరాదు".

"నువ్వోవల్లనన్న బతుకనిస్తెగదా! నాకు దొరికేది. గీ మధ్య మా కంటే ఎక్కువ నీకు భయపడ్తున్రు. ఏం మంత్రమేసినవు. మాతో కొట్లాడి మమ్మల్ని ఓడించిన గిరిజనులు అల్పజీవియైన నీ చేతిలో ఓడిపోతున్నరు. నువ్వు ఇంకెంత మందిని పొట్టన బెట్టుకుంటవు. నువ్వు కడుపునిండా తింటవా అంటే అదీ కాదు. రాత్రంత వేటాడినా నీ కడుపునిండదా బావా!? రోజు వేటాడుడేనా? ఒక సారి కడుపు నిండితే, మళ్ళీ ఆకలయ్యేంత వరకు మేము వేటాడము. నీకెందుకింత దురాశ. నువ్వు తిండి బోతువా?" అనుమానంగా అడ్గింది పులి.

"నేను తిండి బోతును కాదు. తాగుబోతును. గట్లని గుల్‌ఫాం కల్పిన కల్లు–ఇప్ప పువ్వు సారా తాగుతాననుకునేవు. నేను గంత చీప్‌గాదు. రక్తం, రక్తం తాగుతం సరే, అది నేను కాదనుకో... అది వేరే విషయం. రాత్రంతా ఎంత మంది దొరికితే అంత మందిది తాగుడే, ఆనకాలమైతే మాకు పండుగే, ఇగ డాక్టర్లకు, నర్సులకు చేతి నిండా పని. కాన్గిరి దవఖాన్లకు పంట. నీకు తెల్సుగదా! గిరిజన గూడాల్లో ఒకరిద్దరు గాదు. గిరిజన తండాలు, గోండు గూడాలు మంచాన పడుతున్నయి. మేము ముచ్చట పడి ముద్దు పెట్టుకుంటే...మంచం పట్టుడే. డాక్టరు దగ్గరికి ఉర్కుడే. లేకుంటే పైకే పోతరు. గిప్పటిదాక వందల మంది గోండులు గిట్లపోయినోళ్లే".

సర్కార్ వీరప్పన్‌ను పట్టుకోవడానికి ఖర్చువెట్టినట్టు మమ్మల్ని మట్టు బెట్టుడుకు ఖర్చు వెడ్తుంది"

శ్రద్ధగా వింటున్న పులి "మీరు పట్నం పోవచ్చు గదా! గీ అమాయకపు గిరిజనుల గోస ఎందుకు పోసుకుంటున్నరు. నీకు పాపమనిస్తలేదా?" అడ్గింది.

"చాల మంచిగడిగినవ్... బావా! గక్కడ సుగ మా వోల్లున్నరు."

"మరి గక్కడ గిట్ల సచ్చిపోతలేరుగదా?"

"అదా? నీ డౌటూ... పట్నంలో అన్ని తీర్ల విటమిన్లు, ప్రొటీన్లుండె తిండి దొరుకుతది. కడుపు నిండ తింటరు. గాళ్లకు వ్యాధి నిరోధక శక్తి ఎక్కువుంది. పాపం గీ గిరిజన్లకు తిండి కరువాయే. ఏదో ఆకలి మంటకు బుక్కెడు తింటరు. అదేమన్నా బలమైన తిండా! పోషకాలుంట లేవు. ఒకప్పుడు గీళ్లు అడివిల దొరికినయి తిని గట్టి గుండెటోల్లు. గిప్పుడు ఏమీ దొరుకతలేవు. అడువులన్ని నరికేస్తున్రు. గిట్లుండి గూడ సచ్చేంత పని సేత్తరు. గాళ్లకు గీ తిండి ఏమి జాలుతది. ఒక్కలన్నా నీ తీరు బొర్రలున్నొల్లు కనవడ్తరా? గీల్లకు జరమస్తే వారాలు వారాలు కోలుకోరు. సిన్న పిల్లగాండ్లకు, ఆడోల్లకు రక్త హీనత ఎక్కువ. ఇగ పట్నంల రాత్రీ పగలూ కరెంటుంటది. ఎప్పుడు పంకలు తిరుగుతుంటె మేమెట్ల గాల్ల దగ్గరికి పోయేది. గీ మధ్య గవ్వేవో ఎర్రటియి, పచ్చటియి గుండ్రటి సుట్టలు కాల వెడ్తున్రు. మాకెమో గా పొగవాసన పడిసావదు. ఉక్కిరి బిక్కిరయితది. ఇంక గాడ మా పాలిట యములున్నరు. మున్సిపాలిటోల్లు. గదేందో తెల్లటి పొడి నీల్లల్ల కల్పి ఇల్లంత చల్లుతరు. డి.డి.టి... అనేదో అంటారు గదా! గిది జాలదన్నట్టు కిరసనాయిల్ ఫాగ్– మురికి కాలువలల్ల, చెత్తకుప్పలున్న కాడ, ఇండ్ల సుట్టు ప్రక్కల, చెట్లమీద... ఆడ ఈడ అన్ని గదుల.. అంతటా స్ప్రే చేస్తారు. గియన్ని తప్పిచ్చుకొని బయటబడుడు మాటలా? అదిగో ఎవలన్నా బయటపడి, ఎవర్నైనా కాట్సేస్తే డాక్టర్లులుండనే వుండిరు. ఆల్లసలు మమ్ముల్ని ఇంట్లకు రానిస్తేగదా! దర్వాజలకు, కిటికీలకు సన్నని జాలి తెరలు గట్టిగా బిగించుకున్నరు. గాళ్ల దగ్గర పైసలున్నయి. గీల్లెమో గరీబోల్లు. గీల్లను సూత్తె మాకు కండ్లమంట. ముద్దచ్చి ముట్టుకుంటే పానం పోతంది. పోదా మరి డాక్టర్లు దగ్గర లేకపాయిరి. దూరం పోదామంటే పైసలుండక పాయే. అప్పో సప్పో జేసి పట్నంల పెద్ద దవఖానకు పోదామంటే ఆడకు నడువ రాకుండ బురుద. రోడ్లు గూడ లెవ్వు. మంచాలల్ల (డొల్లల్ల) పడుకోవెట్టి నలుగురు మనుషులు పల్లకి మోసినట్టు మోసుకుపోతరు. మైళ్ల దూరం మోసుకుపోవుడు. ఆ కట్టాలు చెప్పరాదు. ఆల్లది రామగోస గందుకే భగవంతుని మీద భారమేసి, చెట్ల పసర్లు, నాటు వైద్యం, భూతవైద్యంతో సరిపెట్టుకుంటున్రు. గీళ్ల బతుకులు గాలికి పెట్టిన దీపం. ముక్కపచ్చలారని పసిబిడ్డలు, ఎదిగిన బిడ్డలు, అంతుచిక్కని రోగాలతో పాణాలు కోల్పోతున్రు.

తల్లి దండ్రులకు కడుపుకోతే మిగులుతుంది. తల్లిదండ్రులుపోయి పిల్లలేమో అనాథలు (దిక్కులేనోల్లు)గా మిగులు తుండ్రు. తోబుట్టిన

అన్నదమ్ములు, అక్కచెల్లెండ్లు, భార్యాభర్తలు అందరూ రాలిపోతున్రు. పచ్చని గిరిసీమలో రోజుకు ఇద్దరు ముగ్గురు జ్వరంతో పానం ఇడుస్తున్రు." ఇదంత వింటున్న పులి కండళ్ల నీళ్లు తిరిగాయి.

"ఇంత పాపపు పని చేయడానికి నీకు మనసెట్ల వస్తుంది. నువ్వు రాక్షసివా?" ఆవేశంగా పులి అన్నది.

లోలోన చిన్నగా నవ్వుకొని మెల్లని స్వరంతో "మమ్మల్ని బద్నామ్ చేయకు. గాళ్ల చావులకు మేముక్కల్లమే కాదు కారణం. ఇంక మస్తు కారణాలున్నయి"

"అవేవో చెప్పరాదు.. మరి" పులి అడిగింది

"ఆనాకాలం ఇంటి చుట్టు పక్కల నీళ్లు నిలిచిపోయి మురుగు గుంటలు తయారయితున్నయి. గా స్విమ్మింగ్ పూల్స్ మాకు మహా ఇష్టం. కాల్లు, సేతులు, సబ్బుతోని సుబ్రంగా కడుక్కోరు. చెత్తా చెదారం, పెంటకుప్పలు ఇంటి చుట్టే ఏసుకుంటరు. తాగే నీళ్ల సౌలత్ సక్కగా లేదు. గూడెంలో ఉండే ఒక సర్కార్ నుయ్యి నిండా పాకురు, కప్పలు. మొన్న ఏయించిన బోరింగ్ కరాబయితే మంచిగ చేసే దిక్కులేదు" చెప్పుతూ పులివైపు చూస్తున్నడు.

పులి కల్పించుకుని "నీళ్లంటే గుర్తచ్చింది. ఒక సారి ఏమైందో తెల్సా! బావి నీళ్లల్ల బ్లీచింగ్ పొడి కల్పిండ్రు. ఎంత కల్పిన్రో గాని నీళ్లన్ని పాల తీరయినయి. గా వాసనకు కప్పలన్ని సచ్చిపోయినయి. గా నీల్లు తాగి కక్కుడు బైలు తలిగి ఏడుగురు సచ్చిపోయిన్రు" పత్రికల్లో వచ్చిన వార్తలను గుర్తు చేసుకుని చెప్పింది.

"సెప్పు నువ్వే జెప్పు గీల్ల సావుకు మేమే కారణమా?" ప్రశ్నించిండు.

"ఇంకో సంగతి తెల్సా నీకు?"

"చెప్పకుండానే ఎట్ల తెలుస్తది" సెటైరేసింది పులి.

"పాత కాలం గోండోల్లు నూతిల నీల్లు తాగరు. కప్పలు గలీజ్ సేత్తయని. బొంకెన ఎంగిలి సేసిన నీల్లు మనం తాగుడని బోరింగ్ నీల్లు తాగరు. దాని నోట్లె కెళ్లి ఊంచిన (ఉమ్మివేసిన) నీల్లు తాగరు అని మూఢ నమ్మకాలు గుడా ఒక కారణం. గందుకు ఎంత దూరమైనా సరే నడ్చి నడ్చి ఎల్లి కుంటలల్ల, వాగులల్ల, చెలిమిలెలు తోడుకొని నీల్లు తెచ్చుకొని తాగుతరు.

అసలు కారణాలు గ్రహించిన పులి "మరి గీ అమాయకపు గిరిజనులు బతికి బట్ట కట్టాలంటే.. ఏమి చేస్తే బాగుంటది" అడ్గింది.

కొద్ది సేపు సంసయించి, మౌనంగా ఆలోచించి మొదలు పెట్టిండు "మలేరియా, డేంగీ, టైఫాయిడ్ రావద్దంటే మేము గుడ్లు పెట్టినపుడు (లార్వాదశ) అంటే జూన్ నెలలో ఏదైన మందు, లేదా కిరసనాయిల్ చల్లితే మా లార్వా అని పిలుచుకొనే తోక పురుగులు సచ్చిపోతయి. మా జనాభా తగ్గిపోతది"

రహస్యం తెలుసుకున్న పులి "మాటల్లపడి అన్ని మర్చిపోయినం. పొద్దుగూకుతోంది" అని గుర్తు చేసింది.

"ఔను గదా! మస్తు దినాలకు కల్సుకున్నం. కడుపు నిండా మాట్లాడుకున్నం. మల్లెపుడు కలుస్తమో? అప్పటి దాక నేను బతికుంటనో లేదో"

"ఇంకా బతికుండి ఎందర్ని చంపుదామని. చాలదా బతికిన కాడికి? దేవుడు నీకు ఆయుస్సు తక్కువిచ్చి పున్నెం గట్టుకున్నాడు" మనసులో అనుకొని పులి బయటకి ముసిముసిగా నవ్వుతూ..

"చా.. అవ్వేమి పాడు మాటలు బావా! అందరు చల్లగుండాలే" అంది. ఒకరి ముఖాలు ఒకరికి కనబడకుండా చీకటయింది. మెల్లగా పులి పరుగు అందుకుంది. ఎండిన ఆకుల చప్పుడు విని "గదేంది బావా! గట్ల సెప్పకుండా పోవడితివి. ఏమి యాదికచ్చింది. ఇదేనా మర్యాద?" బాధ వ్యక్తపర్చాడు.

అదేమి పట్టించుకోని పులి "చీకటి పడింది. నువ్వు రెచ్చిపోయావంటే.. గా గోండుల తీరు నేను..." అనుకొని వేగం పెంచి అడ్రస్సు దొరక్కుండా దారులు మార్చుకుంటు గుహ చేరింది.

" ఓ.. పిరికి, ఎడ్డి బావా! నీ అమాయకత్వం పాడుగాను. నువ్వనుకున్నట్లు గాళ్లను కుట్టేది నేను కాదు. నేను చెట్ల ఆకుల రసం తాగుతూ బతికే అమాయకపు ప్యూర్ వెజిటేరియన్‌ను. నాకు కాదు నువ్వు భయపడాల్సింది. మా ఆడోళ్లు (ఎనాఫిలిస్) మహా డేంజర్. గాల్లు సేయబట్టి మమ్ముల్ని అనుమానించి బద్నామ్ సేత్తున్రు. బాగా సదువుకున్నోడివి, నీకు అంతా తెల్సునన్నుకున్న. అట్టి మట్టి బుర్ర నీది పులిబావా! అహా... అహో. అని పగలబడి నవ్వి బంయ్యొయ్యొయ్య మని వయ్యారంగా రెక్కలాడిస్తూ ఎగురుకుంటూ గోండు గూడెం గుడిసెల వైపు వెళ్లింది మగ దోమ.

రచయిత సెల్ : 9490434909

స్ఫూర్తినిచ్చిన గురువు ఎవరు?

బడికి వెళ్ళినప్పట్నించి కాలేజీ దశ వరకు ఎందరో ఉపాధ్యాయులు మనకు పాఠాలు బోధిస్తారు. వారిలో కొంతమంది గుర్తుండిపోతారు. కొందరు గొప్ప స్ఫూర్తిని ఇస్తారు. వారు చెప్పిన పాఠాలుగానీ, కొన్నిమంచి మాటలు గానీ మనసులో ముద్రించుకుపోతాయి. ఆవిధంగా మిమ్మల్ని ప్రభావితం చేసిన ఉపాధ్యాయుల గురించి ఈ శీర్షికకి రాయండి. మీకు స్ఫూర్తినీ, ఉత్తేజాన్నీ ఇచ్చి ప్రోత్సహించిన ఉపాధ్యాయుల్ని ఈ శీర్షిక ద్వారా గుర్తు చేసుకోండి.

మీ రచనతో పాటు ఫోటో కూడా పంపండి. 'సోపతి'లో ప్రచురిస్తాం.

చిరునామా: సోపతి, ప్రజాశక్తి ఆదివారం సంచిక, ప్రజాశక్తి తెలుగు డైలీ, 21/1, ఎమ్.హెచ్.భవన్, అజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగలింగంపల్లి, హైదరాబాద్-20

రచయితలకు సూచనలు

✎ 'సోపతి' కోసం వ్యాసాలు, కథలు, కవితలు పంపించండి.

✎ కథకు పేజీల పరిమితి లేదు. కథ అయి వుండాలి, అంతే! చదివించే గుణమే ప్రధానం.

✎ అనువాద కథ, కవితలు కూడా పంపించవచ్చు. మూల రచయిత అనుమతి పత్రం తప్పనిసరి.

✎ యాత్రా కథనాలకు ప్రత్యేక ప్రాధాన్యం. మీరు చూసి వచ్చిన ప్రదేశాల గురించి, మీ అనుభవ నేపథ్యంలో రాసి, తగిన ఫోటోలతో పంపించండి.

✎ రచనల్ని తిప్పి పంపాలనుకునేవారు తగిన స్టాంపులున్న కవర్‌ని జత చేయాలి.

✎ రచనతో పాటు రచయిత అడ్రసు ఉండాలి.పిన్‌కోడ్ నెంబరు తప్పనిసరి అవసరం. మీ ఫోను నెంబర్, వీలయితే ఈమెయిల్ కూడా ఇవ్వడం మంచిది.

✎ రచనల ప్రచురణకు సంబంధించి ఫోన్లలో ఎలాంటి సంప్రదింపులకు తావు లేదు.

✎ ఆరోగ్యకరమైన హాస్య, వ్యంగ్య రచనలకు ప్రాధాన్యం వుంటుంది.

✎ సమీక్షకోసం పుస్తకాలు పంపేవారు రెండు ప్రతులు పంపించాలి.

చిరునామా: సోపతి, ప్రజాశక్తి ఆదివారం సంచిక, ప్రజాశక్తి తెలుగు డైలీ, 21/1, ఎమ్.హెచ్.భవన్, అజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగలింగంపల్లి, హైదరాబాద్-20

రుమటాయిడ్ ఆర్థ్రైటిస్‌కు మేలైన వైద్యం

శరీరంలోని ప్రతి జాయింట్‌లో నొప్పి.. వేళ్లు కదపాలంటే నరకం. కాలు కదపాలంటే భయం, దిక్కుతోచని స్థితి. మానసిక సంఘర్షణ. దైనందిన జీవితంలోని ప్రతి అడుగులో బాధ. కదలలేని స్థితి. కొందరిలో ఏ పనీ చేయలేక అచేతనంగా ఉన్న స్థితి. క్షణక్షణం ఈ బాధలు పడలేక జీవితానికి ముగింపు తీసుకుంటే చాలు అనుకునే వారు కోకొల్లలు. ఇది రుమటాయిడ్ ఆర్థ్రైటిస్ ముఖచిత్రం. ఆధునికి హోమియో చికిత్సతో రుమటాయిడ్ ఆర్థ్రైటిస్ రోగులకు సరికొత్త జీవితాన్ని అందించవచ్చని అంటున్నారు ప్రముఖ హోమియో వైద్య నిపుణులు డాక్టర్ మధు వారణాసి.

రుమటాయిడ్ ఆర్థ్రైటిస్ అనే ఈ వ్యాధి ఆటో ఇమ్యూన్ డిసీజెస్ పరిధిలోకి వస్తుంది. ఆటో ఇమ్యూన్ డిసీజ్ అంటే ఏమిటి? మన శరీరంలో యాంటీబాడీస్ అనే కణాలు మన రక్షణ వ్యవస్థను కాపాడుతూ పర్యవేక్షిస్తాయి. ఇవి మన శరీరంలో ప్రవేశించే బ్యాక్టీరియా, వైరస్‌లను ఎదుర్కొంటూ వాటిని నిరోధిస్తూ సమర్థవంతమైన పాత్రను పోషిస్తాయి. కొన్ని సమయాలలో ఈ కణాలు మన శరీరంలో ఉండే సొంత కణాలనే శత్రువులుగా భావించి వాటిని నిర్మూలిస్తాయి. అంటే మనల్ని కాపాడవలసిన కణాలను అవే నిర్వీర్యం చేస్తాయి. దీని ఫలితంగా శరీరంలో కొన్ని వ్యాధులు వస్తాయి. ఇటువంటి వ్యాధులనే ఆటో ఇమ్యూన్ డిసార్డర్స్ అంటారు. ఈ తరగతికి చెందిన వ్యాధులలో అతి ముఖ్యమైనది రుమటాయిడ్ ఆర్థ్రైటిస్. దీర్ఘకాలం ఈ వ్యాధి బాధిస్తుంది. ప్రాణాలు తీసేంత వ్యాధి కాకపోయినా ప్రతి కదలికా రోగికి నరకం చూపిస్తుంది.

మన దైనందిన జీవితంలో ప్రతి కదలిక కీళ్ళపై ఆధారపడి నడుస్తోంది. ఈ కీళ్ళు సరిగా పనిచేస్తేనే కదా మన కడుపు నిండుతుంది. కీళ్ళు పని చేయకుండా పోతే ఆ బాధ వర్ణనాతీతం. ఈ రుమటాయిడ్ ఆర్థ్రైటిస్ మన శరీరంలో ఉండే కీళ్ళనై దాడి చేసి ఆ వ్యక్తిని ఏ పనీ చేసుకోకుండా నిర్వీరుణ్ని చేస్తుంది. మరి దీని లక్షణాలు ఏమిటో చూద్దాం.

లక్షణాలు ఇవి : తొలి దశలో నీరసం, ఆకలి లేకపోవడం, తొందరగా అలసిపోవడం, జర్వం వచ్చినట్లుగా ఉండడం, ఒళ్లంతా నొప్పులుగా ఉంటాయి. కీళ్ళలో నొప్పి, కీళ్ళు కదపలేకపోవడం, కీళ్ళు బిగుసుకుపోవడం జరుగుతుంది. ఉదయం లేచిన వెంటనే కీళ్ళు బిగుసుకుపోయి నడవలేకపోవడం, చేతివేళ్లలో నొప్పి ప్రారంభమై క్రమేపి మిగతా కీళ్ళకు వ్యాపిస్తుంది. వ్యాధి ముదిరిన కొద్ది కీళ ్ళ బిగుసుకుపోయి ఏ పనీ చేసుకోలేని పరిస్థితి రావచ్చును. కొందరిలో ఈ లక్షణాలు తీవ్రతరం అవుతాయి. కొంతమందిలో రుమటాయిడ్ ఆర్థ్రైటిస్ వేరే అవయవాలకు కూడా వ్యాపించవచ్చును. అందుకే దీనిని కీళ్ళకు మాత్రమే సంబంధించిన వ్యాధిగా చూడకూడదు. ఊపిరితిత్తులకు వ్యాపిస్తే శ్వాస సంబంధమైన లక్షణాలు కనిపిస్తాయి. ఛాతీలో నొప్పి, ఆయాసం, దగ్గు, శ్వాస తీసుకునే సమయంలో నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొంత మందిలో గుండెలో సున్నితమైన పొరలు వాచి పెరికార్డిటిస్ అనే వ్యాధి వస్తుంది. దీనివలన ఛాతీలో నొప్పి ఎక్కువగా ఉంటుంది. కొంతమందిలో చేతులలో చిన్న చిన్న కణుతులు లాంటివి వస్తాయి. వీటిని రుమటాయి నాడ్యూల్ అంటారు. మరికొంతమందిలో మణికట్టు వద్ద ఉన్న నరం నొక్కుకు పోయి విపరీతమైన నొప్పితో బాధపడతారు. దీనిని కార్పల్ టెన్నెల్ సిండ్రోమ్ అంటారు. కొన్ని కేసులలో రుమటాయిడ్ ఆర్థ్రైటిస్ రక్తనాళాలపై దాడి చేసి రక్తనాళాలను బలహీన పరుస్తుంది. దీని వలన గోళ్ల చుట్టూ నల్లగా ఏర్పడుతుంది.

రుమాటిక్ గుండె వ్యాధి. ఇది యుక్తవయసులో ప్రవేశించే వ్యాధి. స్త్రీ, పురుషులలో ఎవరికైనా సంభవిస్తుంది. ఆర్‌హెచ్‌డి వ్యాధి 20–25 సంవత్సరాల మధ్య వయస్కులకు వస్తుంది. గుండె కవాటాలను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. రుమాటిక్ ఫీవర్ 4 నుంచి 10 సంవత్సరాల పిల్లలలో కనిపిస్తుంది. ముందుగా జ్వరం, గొంతునొప్పితో మొదలవుతుంది. ఇది తగ్గిన తర్వాత కీళ్ళనొప్పులు మొదలవుతాయి. సరైన చికిత్స తీసుకోకపోతే వ్యాధి పెరుగుతుంది. రుమాటిక్ ఫీవర్ వచ్చిన 10–15 సంవత్సరాలకు రుమాటిక్ గుండె వ్యాధి వస్తుంది. గుండెకు సంబంధించిన కవాటాలు సరైన విధంగా పనిచేయకుండా పోతాయి. ఒకసారి ఇవి చెడిపోతే క్రమేపి వ్యాధి ముదిరిపోయి ఆపరేషన్‌కు దారితీస్తుంది.

నివారణా చర్యలు : అందువల్ల ముందు జాగ్రత్తలు తీసుకుని వ్యాధిని నిరోధించాలి. గొంతునొప్పి, జ్వరం, కీళ్ళనొప్పులు ఉంటే తప్పనిసరిగా వైద్యుని సంప్రదించి చికిత్స తీసుకోవాలి. ఆర్‌హెచ్‌డి అనేది బ్యాక్టీరియా వలన వచ్చే వ్యాధి. రుమాటిక్ ఫీవర్ వచ్చిన తర్వాత బ్యాక్టీరియా శరీరంలోకి ప్రవేశించి గొంతులో కవడరాలు, కీళ్ళ కండరాలు, గుండె కవాటాలను నష్టపరుస్తుంది. అందువల్ల చిన్నతనం నుంచి పరిశుభ్రత పాటించి తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఆర్‌హెచ్‌డిని నివారించడానికి ఆస్కారం ఉంటుంది.

హోమియో చికిత్స : హోమియో వైద్య విధానం శాస్త్రీయమైనది, ప్రకృతి నియమాలపై ఆధారపడినది. మానవశరీరం పనిచేయడానికి అందులో ఉన్న జీవశక్తి ఆధారం. దీనినే వైటల్ ఫోర్స్ అంటారు. ఈ శక్తి మనసును, శరీరాన్ని సమతూకంలో ఉంచుతుంది. దీనినే మనం ఆరోగ్యం అంటాం. ఈ సమతూకంలో ఎలాంటి మార్పులు జరిగినా మన శరీరం వివిధ రీతులలో వ్యక్తీకరిస్తుంది. దీనినే మనము వ్యాధి లక్షణాలుగా వర్గీకరిస్తాము. ఈ లక్షణాలు మానసికి, శారీరక మార్పులుగా గోచరిస్తాయి. ఈ లక్షణాలపై ఆధారపడి చికిత్స చేస్తే ఎలాంటి వ్యాధి అయినా తగ్గే అవకాశం ఉంది. రుమటాయిడ్ ఆర్థ్రైటిస్ చికిత్సా విధానంలో రోగికి సరిపడే మందుని ఎన్నుకోవడం వైద్యుని గొప్పతనం ఇక్కడే కనబడుతుంది. వ్యాధికి సంబంధించిన సమాచారం, వ్యాధి ఎంత వరకు వ్యాపించింది, వ్యాధి మూలంగా శరీర భాగాలకు జరిగిన హాని అంచనా వేయగలిగి చికిత్స చేస్తే సత్వరమైన పరిష్కరం లభిస్తుంది.

మందులు : గ్నాఫాలియం : వేళ్లలో నొప్పి, తిమ్మిరిగా ఉండడం, నొప్పి కాలి వేళ్ల వరకు వ్యాపించడం, పడుకున్నా, కదిలినా బాధలు ఉన్నపుడు ఈ మందు వాడాలి.

లెడమ్ పాల్ : నొప్పి పాదంలో మొదలై పైకి వ్యాపించడం, చల్లదనం తగిలితే బాధ ఉపశమించడం వంటి లక్షణాలకు ఇది చక్కని మందు.

సెడ్రాన్ : ప్రతిరోజు ఒకే సమయంలో నొప్పి రావడం వంటి లక్షణాలకు ఇది బాగా పనిచేస్తుంది.

స్వంత వైద్యంతో రుమటాయిడ్ ఆర్థ్రైటిస్‌కు మందులు వాడితే చాలా సమస్యలు వస్తాయి. అనుభవజ్ఞుడైన వైద్యుని పర్యవేక్షణలో మందులు వాడితే రుమటాయిడ్ ఆర్థ్రైటిస్ దూరం కావడానికి అవకాశం ఉంది.

డా॥మధు వారణాశి ఎం.డి
ప్రముఖ హోమియో వైద్య నిపుణులు
ప్లాట్ నెం.188,
వివేకానంద నగర్ కాలనీ
కూకట్‌పల్లి, హైద్రాబాద్.
ఫోన్ : 8897331110,
8886509509

సోర్స్ కోడ్ కె.ఎక్స్.రాజు

2014లో ఉత్తమ ఆవిష్కరణలు!

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం నేటి మనిషి జీవనశైలిపై విస్తృతమైన ప్రభావం చూపుతోంది. 2014లో అనేక ఉత్తమ సాంకేతిక ఆవిష్కరణలు చోటు చేసుకున్నాయి. టెక్నాలజీ పుణ్యమా అంటూ శాస్త్ర సాంకేతిక విభాగంలో నిత్యం ఏదో ఒక ఆవిష్కరణ చోటుచేసుకుంటూనే వుంది. ఈ ఏడాది స్మార్ట్‌ఫోన్‌ల వాడకం విపరీతంగా పెరిగిపోయింది. వాక్ మెన్.. మొబైల్ ఫోన్...టాబ్స్, కంప్యూటర్ ఇలా అనేక ఆవిష్కరణలు ప్రపంచ స్థితిగతులను మార్చేసాయి. టెక్నాలజీ ప్రపంచంలో 2014కు ప్రత్యేకమైన గుర్తింపు లభించింది. పలు విప్లవాత్మక ఆవిష్కరణలకు ఈ ఏడాది సాక్షిగా నిలిచింది. విప్లవాత్మక ఇంటరాక్టివ్ యాప్స్ పుట్టుకొచ్చాయి. వ్యక్తిగత క్లౌడ్ సర్వీసులకు ఆదరణ పెరిగింది. ఆన్‌లైన్ షాపింగ్ అంటూ ఈ-కామర్స్ వెబ్‌సైట్‌ల వైపు జనం పరుగులు తీస్తున్నారు. చాలా సర్వీసులు డిజిటల్ రూపంలోకి మారిపోతున్నాయి. దీనిబట్టి చూస్తే రానున్న 2015 మరిన్ని అద్భుతమైన ఆవిష్కరణలకు వేదిక కానుందనే విషయం మనకు స్పష్టమవుతుంది. 2014లో ఆవిష్కృతమైన కొన్ని ముఖ్యమైన ఆవిష్కరణల గురించి చూద్దాం...

స్మార్ట్‌ఫోన్‌లు : భారీ అంచనాలతో ప్రారంభమైన 2014 అత్యాధునిక సాంకేతిక ఆవిష్కరణలతో ఘనంగా ముగింపుకు చేరుకుంది. స్మార్ట్‌ఫోన్‌ల విభాగంలో ఈ ఏడాది అనేక అద్భుతాలనే మనం చూడగలిగాం. బడ్జెట్ ఫ్రెండ్లీ ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్‌లకు ఎక్కడా లేనంత గిరాకీ ఇండియన్ మార్కెట్లో ఉంది. కమ్యూనికేషన్ పరిజ్ఞానం మరింతగా అప్‌గ్రేడ్ అయిన నేపథ్యంలో దేశంలోని అనేక కుటుంబాలు ఫీచర్ ఫోన్‌ల వినియోగం నుంచి స్మార్ట్‌ఫోన్‌ల వినియోగంలోకి మారుతున్నాయి. ఈ పోకడలను పూర్తి స్థాయిలో సమీక్షించిన అనేక సంస్థలు 3జీ, 4జీ టెక్నాలజీతో మధ్య తరగతి వినియోగదార్లకు సైతం అందుబాటులో వుండే మోడల్స్‌ను ఆవిష్కరించాయి.

క్లౌడ్ కంప్యూటింగ్ : క్లౌడ్ కంప్యూటింగ్ సేవలకు ఏ విధమైన పరిధిలు లేవు, ఎటువంటి సర్వీసులనైనా అందిస్తుంది. అప్లికేషన్‌లు మొదలుకుని సాఫ్ట్‌వేర్‌ల వరకు క్లౌడ్ కంప్యూటింగ్‌లో సులువుగా లభ్యమవుతాయి. క్లౌడ్ కంప్యూటింగ్ గుర్తించి క్లుప్తంగా చెప్పాలంటే ఆయా క్లౌడ్ కంప్యూటింగ్ సేవలనందించే సంస్థలు తాము ఏర్పాటు చేసిన ప్రత్యేకమైన వెబ్ సర్వర్ల ద్వారా క్లయింట్‌కు కావల్సిన అప్లికేషన్స్ ఇంకా డేడా స్టోరేజ్‌ను అందిస్తాయి. క్లౌడ్ కంప్యూటింగ్‌లో భాగంగా క్లయింట్ స్టోర్ చేసిన డేటా మొత్తం ఒక వెబ్ సర్వర్‌లో స్టోరేజ్ కాబడి ఉంటుంది. అంటే క్లయింట్ వినియోగించిన కంప్యూటర్‌లో ఏ విధమైన డేటా ఇంకా అప్లికేషన్స్ ఉండవు. కేవలం డివైస్ ఆపరేటింగ్ సిస్టం ఇంకా క్లౌడ్ కంప్యూటింగ్ సర్వీసును అందించే సంస్థ అప్లికేషన్ మాత్రమే ఉంటుంది. గూగుల్, మైక్రోసాఫ్ట్, హెచ్‌పీ వంటి ప్రముఖ కంపెనీలు క్లౌడ్ కంప్యూటింగ్ సేవల నిమిత్తం భారీగా వెచ్చిస్తున్నాయి. 2015లో క్లౌడ్ కంప్యూటింగ్ సేవలు మరింతగా విస్తరించనున్నాయి.

యాప్స్ : ఈ ఉరుకుల పరుగుల జీవితంలో భాగంగా కొత్త ఆలోచనలతో పుట్టుకొచ్చిన ఆన్ డిమాండ్ అప్లికేషన్లకు ఆదరణ అమాంతం పెరిగిపోయింది. రకరకాల యాప్ ఆవిష్కృతమవుతున్నాయి. పెరుగుతున్న మానవ అవసరాలకనుగుణంగా యాప్స్ కూడా పుట్టుకొస్తున్నాయి. ఉదాహరణకు ఈ ఆన్ డిమాండ్ యాప్స్‌తో కోరుకున్న ఆహారాన్ని క్షణాల వ్యవధిలో మన వద్దకు రప్పించుకోగలుగుతున్నాం. అలానే సినిమా టికెట్లను బుక్ చేసుకోగలుగుతున్నాం. ఈ విషయాల్లో మాత్రమే కాదు ట్రావెల్ బుకింగ్స్, హోటల్ రిజర్వేషన్స్, ఎమర్జెన్సీ హెల్త్ సర్వీసెస్ ఇలా అనేక విభాగాల్లో ఆన్-డిమాండ్ యాప్స్ మన అవసరాలను తీరుస్తున్నాయి. వీటిని ఉపయోగించుకోవటం ద్వారా సమయాన్ని ఆదా చేసుకోగలుగుతున్నాం. రానున్న రోజుల్లో ఈ తరహా ఆన్ డిమాండ్స్ యాప్స్ మరింత విస్తరించే అవకాశముంది.

సెల్ఫీ స్టిక్ : 2013లో పరిచయమైన సెల్ఫీ సంస్కృతి ఈ ఏడాది కొత్త పుంతలు తొక్కింది. సెల్ఫీతో రెల్ఫీ అనేది కూడా వాడుకలోకి వచ్చింది. అంతే ముఖ్యంగా సెల్ఫీలను అత్యంత సౌలభ్యంగా తీసుకోడానికి వీలుగా సెల్ఫీ స్టిక్ అనేది ఈ ఏడాది వాడుకలోకి వచ్చింది.

యాపిల్ వాచ్ : యాపిల్ ప్రతిష్టాత్మకంగా డిజైన్ చేసిన యాపిల్ వాచ్ అత్యాధునిక స్మార్ట్ మొబైలింగ్ ఫీచర్లతో నవశకానికి నాంది పలుకుతోంది. 2015లో వీటిని యాపిల్ వాచ్ మార్కెట్లో లభ్యమవుతుంది. ధర అంచనా 349డాలర్లకు పైగా వుంది. ఇప్పటికే సోనీ, సామ్‌సంగ్, మోటరోలా, ఎల్‌జీ వంటి కంపెనీలు స్మార్ట్ మొబైలింగ్ ఫీచర్లతో కూడిన స్మార్ట్‌వాచ్‌లను అందుబాటులోకి తీసుకువచ్చాయి. రానున్న రోజుల్లో స్మార్ట్‌వాచ్ టెక్నాలజీ మరింత క్రియాశీలకం కానుంది.

3డీ ప్రింటింగ్ : 2013లో ప్రారంభమైన 3డీ ప్రింటర్ల హవా అన్ని విభాగాల్లోనూ విస్తరించింది. ఇంజనీరింగ్, క్లాతింగ్ ఇలా అనేక పరిశ్రమల్లో 3డీ ప్రింటర్లను విస్తృతంగా వాడుతున్నారు. మనకు కావల్సిన మెటీరియల్‌తో మనకు నచ్చిన వస్తువులను ఈ 3డీ ప్రింటర్ల ద్వారా తయారు చేసుకోవచ్చు. 2015లో 3డీ ప్రింటర్ల వినియోగం మరింతగా పెరిగే అవకాశముంది.

2డి కెమెరా : ప్రొఫెసర్ జీన్ కే బీర్ నేతృత్వంలోని పరిశోధకులు, ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన 2డి కెమెరాను అభివృద్ధి చేశారు. వాషింగ్టన్ విశ్వవిద్యాలయం యొక్క నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ బయోమెడికల్ ఇమేజింగ్ అండ్ బయోఇంజనీరింగ్ కు చెందిన ఈ పరిశోధకులు ఈ డి కెమెరాను అభివృద్ధి చేశారు. ఈ పరిశోధనకు సంబంధించిన అంశాన్ని 3 డిసెంబర్ 2014న 'జర్నల్ నేచర్' పత్రికలో ప్రచురించారు. ప్రతి సెకనుకు అత్యధికంగా 100 బిలియన్ ఫ్రేములను బంధించే, ఈ కెమెరాను బయోమెడిసిన్, ఆస్ట్రానమీ మరియు ఫోరెన్సిక్ రంగాల్లో ఉపయోగించనున్నారు. ఈ కెమెరా అభివృద్ధి కోసం పరిశోధకులు, కంప్రెస్సెడ్ అల్ట్రాఫాస్ట్ ఫోటోగ్రఫీ (సియాపి) అనే సాంకేతికతను ఉపయోగించారు. సాధారణ కొడాక్, కెనన్ కెమెరాల లాగా ఉండని ఈ కెమెరా హైపవర్ మైక్రోస్కోప్ టెలిస్కోప్ ల మాదిరిగా పనిచేస్తుంది. ఇది వేగంగా జరిగే జీవక్రియలను మరియు రసాయనిక చర్యలను అర్థం చేసుకోవడంలో ఎంతగానో ఉపయుక్తంగా ఉండనుంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న అల్ట్రాఫాస్ట్ ఇమేజింగ్ సాంకేతికతలు మరియు ఆన్ చిప్ స్టోరేజ్, ఎలక్ట్రానిక్ రీడ్ అవుట్ స్పీడ్ ల సాయంతో కెమెరాలు సెకనుకు 10 మిలియన్ ఫ్రేములను అందిస్తాయి.

మొబైల్ చెల్లింపు విధానం: యాపిల్ సంస్థ వృద్ధి చేసిన 'యాపిల్ పే' అనే నగదు చెల్లింపు స్మార్ట్‌ఫోన్ అప్లికేషన్‌కు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ

పెరుగుతోన్న నేపథ్యంలో రానున్న రోజుల్లో మొబైల్ చెల్లింపు విధానం (వీశీఎఱశ్రీవ జూఉఎవత్ ంఎర్‌వఎం) మరింత విస్తృతం కానుంది. ఈ తరహా యాప్‌కు బ్యాంక్ అకౌంట్ లేదా క్రెడిట్, డెబిట్ కార్డ్‌లను అనుసంధానం చేసినట్లయితే అన్ని రకాల ఆన్‌లైన్ చెల్లింపులను ఈ స్మార్ట్‌ఫోన్ యాప్ ద్వారానే చేసేయవచ్చు. యాపిల్ పే తరహాలోనే గూగుల్ వాలెట్, పేపాల్, లెవలప్, స్కేర్ వాలెట్ వంటి యాప్స్ మొబైల్ చెల్లింపు సేవలను అందిస్తున్నాయి. అయితే ఇవి ప్రస్తుతానికి యూఎస్‌లో మాత్రమే అందుబాటులో ఉన్నాయి. త్వరలోనే ఇవి మరిన్ని దేశాలను విస్తరించనున్నాయి.

సోషల్ పేమెంట్స్ : ప్రముఖ మెసేజింగ్ యాప్ 'లైన్' ఇటీవల 'లైన్ పే' పేరుతో సరికొత్త సర్వీసును విడుదల చేసింది. నేరుగా ఈ యాప్ ద్వారానే నగదును ట్రాన్స్‌ఫర్ చేసుకుని వస్తువులను కొనుగోలు చేయవచ్చు. చైనా ఇంకా కొరియాలలో ఈ తరహా సోషల్ చెల్లింపులు సర్వ సాధారణంగా మారిపోయాయి. స్నాప్‌చాట్, ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి ప్రముఖ సోషల్ నెట్‌వర్కింగ్ యాప్స్ ఈ తరహా చెల్లింపు సర్వీసులను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నాయి.

వెబ్ ఆర్టీసీ : మార్కెట్లో మీడియా స్ట్రీమింగ్ మరింతగా పుంజుకుంటోంది. ముఖ్యంగా స్మార్ట్‌ఫోన్ యూజర్లు ఇంటర్నెట్ ద్వారా తమకు అవసరమైన ఆడియో, వీడియోలను స్ట్రీమ్ చేసుకుంటున్నారు. వేగవంతమైన స్ట్రీమింగ్ సర్వీసులను చేరువ చేసే ఉద్దేశ్యంతో అందుబాటులోకి వచ్చిన వెబ్‌ఆర్టీసీ బ్రౌజర్ అంతరాయంలేని ఆడియో, వీడియో స్ట్రీమింగ్‌కు సహకరిస్తున్నది. ఈ బ్రౌజర్‌లో గేమ్స్ అలానే మ్యూజిక్ వేగవంతంగా లోడ్ అవుతాయి. వెబ్‌ఆర్టీసీ ప్రస్తుతం గూగుల్ హ్యాంగ్‌అవుట్స్, అమెజాన్ మేడే సర్వీసులకు అందుబాటులో ఉంది. త్వరలో మరిన్ని మొబైల్ యాప్స్ వెబ్‌ఆర్టీసీ బ్రౌజర్‌ను అందుబాటులోకి తీసుకురానున్నాయి.

కనెక్టెడ్ హోమ్స్ : ఇటీవల కాలంలో అనేక స్మార్ట్‌హోమ్ కాన్సెప్ట్‌లను మనం చూసాం. యాపిల్, గూగుల్ వంటి దిగ్గజ టెక్నాలజీ కంపెనీలు స్మార్ట్ హోమ్ టెక్నాలజీ పై దృష్టి సారించాయి. వీటికి సంబంధించిన పరిశోధనలను ఈ రెండు కంపెనీలు చాలా రహస్యంగా చేపడుతున్నట్లు సమాచారం. 2015లో వీటి గురించిన మరిన్ని కీలక అప్‌డేట్‌లు మనకందే అవకాశముంది. ఇప్పటికే గూగుల్ డ్రైవర్ రహిత కార్లను పరీక్షించి విజయవంతమైంది.

- రచయిత సెల్ : 9490099219

■ వికాసం

లక్ష్యమేంటో ఈ రోజే గుర్తించండి

విపరీతమైన బద్ధకం, పనులను వాయిదా వేయడం, చేపట్టిన పనిని మధ్యలోనే వదిలేసి పక్కకు తప్పుకోవడం వంటి అవలక్షణాలు మనుషుల జీవితాల్లో భాగంగా మారిపోయాయి. విశ్రాంతికి ఇచ్చిన ప్రాధాన్యతను శ్రమకు ఇవ్వడం లేదు. ఇలాంటి వాటిని త్వరగా వదిలించుకోకపోతే జీవితం నిరర్ధకంగా మిగిలిపోతుంది. కేరళలోని ఓ దేవాలయంలో గజరాజు దాని సంరక్షణకు మావటి ఉండేవాడు. ప్రతిరోజూ సాయంత్రం మావటి ఆ ఏనుగును బయటకు తీసుకెళ్ళేవాడు. వీధుల గుండా నడుస్తున్నప్పుడు ఏనుగు తన చేష్టలతో అందరినీ ఇబ్బంది పెట్టేది. దుకాణంలో అరటిపండ్లు కనిపిస్తే తొండంతో లాక్కొని నోట్లో వేసుకొని మింగేసేది. ఇక కొబ్బరికాయలు కనిపిస్తే చటుక్కున తొండంతో అందుకొని కరకరలాడించేది. మావటి ఎంత గట్టిగా ప్రయత్నించినా అది తన తీరు మార్చుకునేది కాదు.

ఏనుగు చేష్టల వల్ల పాపం దుకాణదారులు నష్టపోయేవారు. దేవుడికి చెందిన ఏనుగు కావడంతో ఏమీ చేయలేక లోలోపల బాధపడుతూ ఉండేవారు. ఒకరోజు మావటికి బ్రహ్మాండమైన ఆలోచన తట్టింది. తన చేతిలో ఉన్న కర్రను తొండంతో పట్టుకొని నడవాలని ఏనుగును అజ్ఞాపించాడు. వెంటనే అది కర్ర కిందిపడిపోకుండా తొండంతో చుట్టి బిగించింది. ఆలయం నుంచి బయటకు నడవగానే దుకాణాల్లో అరటిపండ్లు, కొబ్బరికాయలు కనిపించాయి. ఏనుగు నోట్లో నీళ్ళూరాయి. వాటిని అందుకొందామంటే వంపు తిరిగిన తొండంలో కర్ర ఉండడంతో సాధ్యం కాలేదు. తొండంను ముందుకు చాపితే కర్ర కిందపడిపోతుంది. మావటి శూలంతో పొడిచి శిక్షిస్తాడు. ఒక చేసేదిలేక గజరాజు బుద్ధిగా ముందుకు నడిచింది. అప్పటి నుంచి దుకాణదారుల కష్టాలు తీరాయి. వారు ఆనందంతో అప్పుడప్పుడు ఏనుగుకు బహుమతులు ఇస్తూ ఉండేవారు. ఈ కథను నిశితంగా పరిశీలిస్తే మనం కూడా ఏనుగు లాంటి వాళ్లమేనని తెలుస్తుంది. మన జీవితాలను పక్కదారి పట్టించే ఆకర్షణలు చుట్టుపక్కల చాలా ఉంటాయి. వాటి వలలో పడొద్దంటూ మన మావటీలు.. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హెచ్చరిస్తూనే ఉంటారు అయినా వారి మాటలను పట్టించుకోకుండా మొండిగా ముందుకెళ్లి నష్టపోతుంటాం. ఎక్కువగా టీవీ చూడడం, అతి నిద్ర, పనికిమాలిన కబుర్లతో సమయాన్ని వృథా చేస్తుంటాం.

పరిస్థితిలో మార్పు రావాలంటూ మావటి ఏనుగును ఇచ్చిన కర్ర లాంటిది కావాలి. జీవితానికి ఒక అర్ధవంతమైన లక్ష్యం ఉద్దేశ్యం తప్పనిసరిగా ఉండాలి. ఆలక్ష్యం చేతిలోంచి జారిపోకుండా ఉండాలంటే నిరంతరం శ్రమించాలి. ఏర్పరచుకున్న లక్ష్యం మనిషిని సరైన దారిలో నడిపిస్తుంది. ఏనుగు తొండంలాగే మన మనసు కూడా విచ్చలవిడిగా సంచరిస్తుంది. మనసును దారిలో పెట్టాలంటే లక్ష్యాన్ని నిర్దేశించుకొని దాన్ని సాధించేందుకు కృషి ఆరంభించాలి.

చేయకూడని పని చేస్తుంటే పెద్దలు వారిస్తుంటారు. అయినా పిల్లలు వినకుండా చేసేస్తుంటారు. ఇలాంటి సందర్భాల్లో నష్టపోయే పనులు చేయకుండా ఆపాలంటే వారికి మంచి పనులు అప్పగించాలి. టీవీ చూస్తూ కాలం గడిపేస్తున్నారా? అయితే మంచి పుస్తకం చదవమని చెప్పండి. బంగాళాదుంప చిప్స్ అతిగా తింటున్నారా? అయితే ఏదైనా పండు తినమని చెప్పండి. శ్రమ చేయకుండా ఇంట్లో కూర్చొని ఒళ్లు పెంచుతున్నారా? అయితే రోజూ బయటికెళ్లి పరిగెత్తమని చెప్పండి. ఇవన్నీ ఇతరులకు చెప్పడమే కాదు. మనం కూడా కచ్చితంగా ఆచరించాలి. చేయడానికి అర్ధవంతమైన పని లేకపోతేనే జీవితంలో సమస్యలు మొదలవుతాయి. లక్ష్యం లేకుంటే దాన్ని సాధించడానికి కృషి చేయాల్సిన అవసరం రాదు. ఫలితంగా బద్ధకం పెరిగిపోతుంది. విలువైన సమయం వృథాగా గడిచిపోతుందిజ బద్ధకస్తుడి మనసు భూతాల నిలయం అనే పాత సామెత ముమ్మాటికీ నిజం. కాబట్టి లక్ష్యం లేకపోయినా కనీసం మంచి అలవాట్లను ఏర్పరచుకోవాలి. వాటిని క్రమబద్ధంగా ఆచరించాలి. ఇప్పటివరకు వ్యర్థంగా గడిచిపోయినా కాలాన్ని మర్చిపోండి. ఇకనైనా కార్యాచరణలోకి అడుగుపెట్టండి. మిమ్మల్ని ముందుకు నడిపించే ఒక లక్ష్యాన్ని జీవితానికి ఒక ఉద్దేశాన్ని నిర్దేశించుకోండి. రోజు ఏదో ఒక మంచి పనిచేయండి. కానీ, ఏ పనీ చేయకుండా ఖాళీగా మాత్రం కూర్చోవద్దు. నిజంగా ఏపనీ లేకపోతే... రోజు మీకు ఇష్టమైన ఆట ఆడండి. దానివల్ల ఎన్నో ప్రయోజనాలుంటాయి. కథలోని ఏనుగులాగా అందరికీ మావటి లభించకపోవచ్చు. అయినా కర్రను సంపాదించుకోవాల్సిందే. మనం ఏర్పరచుకున్న లక్ష్యమే ఆ కర్ర మీ లక్ష్యమేంటో ఈ రోజే గుర్తించండి.

- ఆశాభారతి

వస్తువైశాల్యం ఈ పాటల ప్రత్యేకత



స్ఫూర్తి పాటలు, పేజీలు: 368, వెల: రూ. 200
ప్రచురణ: ప్రజానాట్యమండలి,
ప్రతులకు: ప్రజాశక్తి పుస్తక కేంద్రాలు,
ఫోను: 94900 98694

బహుళ అంశాల మీద రాసిన పాటల సంపుటి 'స్ఫూర్తి పాటలు'. విస్తారమైన వస్తువైవిధ్యం ఈ పాటల ప్రత్యేకత. "నేను రాసిన ప్రతీ పాట వెనుక ఒక గాథ ఉంది. అవి చదువుకున్నప్పుడల్లా... పాడుకున్నప్పుడల్లా ఇక్కడి జీవితం అవుపడుతుంది..." అంటూ తన పాటల నేపథ్యాన్ని ముందుమాటలో వివరించారు స్ఫూర్తి. 1991 నుంచి పాటలు రాస్తున్నారు. వాటిలో విభిన్న అంశాల మీద రాసిన 153 పాటల్ని ఏరికూర్చి ఈ పుస్తకంగా తీసుకొచ్చారు. తన పాటల పుట్టుకకు కమ్యూనిస్టు పార్టీ, ప్రజా సంఘాలు తోడ్పడిన రీతిని వివరించారు. ప్రజానాట్యమండలి తనను తాను సమున్నతీకరించుకోడానికి అందించిన చేయూతను గుర్తు చేసుకున్నారు. అద్దేపల్లి రామమోహనరావు, శివారెడ్డి, సీతారాం, ఆర్.రమేష్, వొరప్రసాద్‌ల ముందుమాటలు స్ఫూర్తి పాటల నేపథ్యం, పాటల విశిష్టతను వివరిస్తాయి. స్ఫూర్తి తపనలు, ఆరాటాలు, ప్రజల కోసం పాటలను సృజించడానికి పడిన శ్రమ ఈ పాటల్లో మిళితమై కనిపిస్తాయి.

ఎర్రజెండాతో మొదలుపెట్టి అనేకానేక అంశాల మీద సందర్భానుసారంగా స్ఫూర్తి రాసిన పాటలు ఆయన దృక్పథాన్ని చెబుతాయి. వివిధ వృత్తులకు సంబంధించిన వారి వెతల్ని, బతుకురీతుల్ని పాటలుగా గట్టి పాడారు. అలాగే గ్లోబలైజేషన్ ప్రభావం కారణంగా వాటిల్లిన విపత్తుల్ని పాటలుగా చేశారు. పర్యావరణాన్ని, తెలుగు భాషను గురించి రాశారు. మహిళల బాధలకు పల్లవులు సమకూర్చారు. సకల రంగాలు, సమస్త అంశాలు స్ఫూర్తి పాటలకు ఇతివృత్తాలయ్యాయి. స్మృతిగీతాలు ఒక ప్రత్యేక ఆకర్షణ. దాదాపు రెండు దశాబ్దాలుగా గీతరచనని ఒక ఉద్యమంగా కొనసాగించడమే విశేషం. ఈ కొనసాగింపు స్ఫూర్తి నిబద్ధతను సూచిస్తుంది. వస్తువులో వైశాల్యం అపారం. పాటల అల్లికలో, అలంకారంలో, సొగసుదనంలో కొత్తదనం తీసుకువచ్చారు. అందుకే స్ఫూర్తి పాటలు అనేక అస్తిత్వాలకు చెందినవారి సంవేదనల్ని వినిపిస్తున్నాయి. ఉద్యమాలకు ఉత్తేజాన్ని ఇస్తున్నాయి. ప్రజా సమూహాల్ని ఉద్యమాల్లోకి తీసుకువచ్చేందుకు ప్రేరణగా నిలిచాయి. కనుకనే ప్రజా ఉద్యమాల్లో పనిచేసే కళాకారుల, కళాబృందాల దగ్గర ఈ పాటల పుస్తకం ఉండాలి.

వస్తురూపాల విశ్లేషణ



కథానిక-వస్తురూపాలు
రచన: విహారి, పేజీలు: 162, వెల: రూ. 120,
ప్రతులకు: చినుకు పబ్లికేషన్స్, గాంధీనగర్, విజయవాడ, ఫోను: 98481 32208

ఆధునిక తెలుగు సాహిత్యంలో మంచి ఆదరణ పొందిన ప్రక్రియ కథానిక. దాని వస్తురూపాలకు సంబంధించిన విశ్లేషణా వ్యాసాలు విహారి గారు రాశారు. స్వయంగా కథా రచయిత, విమర్శకుడు అయిన విహారి గారికి కథానిక ప్రక్రియ పట్ల పట్టు వుంది. దాదాపు పన్నెండు సంపుటాల కథలు రాశారు. వారు ఇదివరలో వెలువరించిన కథాకృతి పుస్తకాల్లో అనేకమంది కథల్లోని మేలిమి అంశాల్ని పరిచయం చేశారు. కథాశిల్పానికి సంబంధించిన అంశాల్ని చర్చించారు.

చినుకు పబ్లికేషన్స్ వారు విహారి గారు వివిధ సందర్భాల్లో కథాప్రక్రియ మీద విహారి గారు రాసిన వ్యాసాలన్నిటిని కలిపి 'కథానిక వస్తురూపాలు' శీర్షికన ప్రచురించారు. దాదాపు యాభై వ్యాసాలు దీనిలో వున్నాయి. కథా నిర్మాణం, కథాశిల్పం, కథానిక వస్తువిస్తృతి, కథలో కవిత్వం వంటి అంశాల్ని గురించి వివరించారు. వాటికి సంబంధించిన పలు పార్శ్వాల్ని వ్యాసాల్లో విశ్లేషించారు. ముఖ్యంగా తెలుగు కథా సాహిత్యంలో వచ్చిన బహుళ సంకలనాల్ని గురించి రాసిన వ్యాసాలు ఎంతో సమాచారాన్ని, విశ్లేషణని అందిస్తాయి.

తెలంగాణ కథలు, విస్మృత కథ, బంగారు కథలు, కథాభారతి, కొత్త కథ, నూరేళ్ళ పంట, కడప కథ, అమెరికా తెలుగు కథానికి, రెండు దశాబ్దాలు-కథ, నూరేళ్ళ నూరు కథకులు- నూరు కథానికలు, నవతరం తెలుగు కథ వంటి సంకలనాల మీద విహారి గారు రాసిన వ్యాసాలు చదివితే తెలుగు కథానిక విస్తృతి, వైశాల్యం తెలుస్తాయి. దాదాపుగా వందేళ్ళ కథాసాహిత్యాన్ని వారు అధ్యయనం చేశారని వారి వ్యాసపరంపరని చూస్తే అర్థమవుతుంది. వందలాది మంది కథకుల కథలు చదవడం, వాటి మంచిచెడ్డలు విశ్లేషించడం చెప్పుకోదగ్గ విషయం. కథానికా ప్రక్రియ మీద ఇంత విస్తారంగా కృషి చేస్తున్న అరుదైన విమర్శకుడు విహారి గారు. వారి విమర్శనా రీతినీ, తెలుగు కథల మేలిమినీ, పరిమితులనీ అర్థం చేసుకోడానికి ఉపకరించే వ్యాసాల సంపుటి 'కథానిక-వస్తురూపాలు'. తెలుగు కథా సాహిత్యం మీద ఆసక్తి కలవారికీ, పరిశోధక విద్యార్థులకు ఉపయుక్త గ్రంథమిది.

- కుమార్

అందుకున్నాం

తుడుం, శ్రీకాకుళ సాహితి
వెల : 60/-, పేజీలు : 112
ప్రతులకు :
మైత్రీ పుస్తకకేంద్రాలు, దిశ బుక్ సెంటర్, మిని బుక్‌స్టాల్ శ్రీకాకుళ సాహితి, హరిత 11-2, విశాఖ ఎ కాలనీ, శ్రీకాకుళం.

కవిత్వంలో సమాంతరరేఖలు-సంక్షోభాలు
దేవరాజు మహారాజు
వెల : 110/-, పేజీలు:110
ప్రతులకు: డా॥దేవరాజు మహారాజు, జి-1, ఆస్త్రా హైట్స్, అపర్ణ సరోవర్ ఎదురు, నల్లగండ్ల, గోపన్‌పల్లి రోడ్, హైదరాబాద్



షాడో, చింతం ప్రవీణ్
వెల : 50/-,
పేజీలు : 87
ప్రతులకు :
చింతం ప్రవీణ్ 16-10-237, శివనగర్ వరంగల్
ఫోన్ :9346886143

విజేత

జయుడు, జూలూరి గౌరీ శంకర్,
అడుగుజాడలు పబ్లికేషన్స్, హైదరాబాద్
వెల : 300/-, పేజీలు : 368
ప్రతులకు : అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు

తెలంగాణ ఉద్యమాన్ని రాజకీయ ప్రక్రియగా మరల్చడంలో రాజకీయ ప్రక్రియ ద్వారా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంలో కెసిఆర్ వి'జయం' సాధించారు. రోజుకొక అంశాన్ని కెసిఆర్ ఎన్నికల్లో వ్యూహాత్మకంగా వేదికపైకి తీసుకొచ్చారు. కాంగ్రెస్ నేతలపై, కాంగ్రెస్ వైఫల్యాలపై కెసిఆర్ ప్రశ్నిస్తే ఎన్నికల ప్రస్థానంలో సమాధానం చెప్పలేకపోయారు. తెలుగుదేశం, బిజెపిలకు కూడా దిక్కుతోచకుండా పోయింది. తెలంగాణ జిల్లాల సమస్యలను ముందుకు తీసుకుపోవడమే కాకుండా, ఆ సమస్యలకు పరిష్కారం చూపిస్తానని భరోసా ఇచ్చారు. తెలంగాణ మట్టి గొప్పతనాన్ని కెసిఆర్ తప్ప ఇతర పార్టీల నాయకులెవరూ చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. ఒక పార్టీగానీ, నాయకుడు గానీ ప్రజలకు దగ్గరగా ఉంటే అది మనగలుగుతుంది. ప్రజలను విడిచిన పార్టీలు కనుమరుగవుతాయి. 2014 ఎన్నికలు దీన్ని నిరూపించాయి. సాంప్రదాయంగా 60 ఏళ్ళ బంధం కలిగిన కాంగ్రెస్ నుంచి, టిడిపి నుంచి మళ్ళించడం, వారిని ఒప్పించి ఓటు వేయించుకోవడం చాలా కష్టమైన పని. ఈ కష్టపు పనిని కెసిఆర్ తెలంగాణ ఉద్యమ అయస్కాంతంతో ఆకర్షించాడు. ఏ ఉద్యమంలోనైనా సరే ప్రజలు చేసిన పోరాటమే చరిత్ర అవుతుంది. తెలంగాణ తెచ్చిన వాళ్ళది, తెలంగాణ కోసం తెగించిన వాళ్ళదే ఇవ్వాళ్టి కొత్త చరిత్ర. ఉద్యమంలో విజయం సాధించిన చరిత్రకు తోడుగా, నవ తెలంగాణ నిర్మించడంలో లేదా తెలంగాణ పునర్నిర్మాణంలో కెసిఆర్ ముఖ్యపాత్ర వహించవలసి ఉంటుంది. అందుకు మనం కూడా సహకరించాలి.

తెలంగాణ ఉద్యమం కొనసాగుతుంటే దీనిపై అణచివేతలో కూడా ఇదే కాంగ్రెస్ అధికారంలో ఉండి కొనసాగించింది. టిఆర్ఎస్ క్షేత్ర స్థాయిలో వుండి ఉద్యమ స్ఫూర్తితో పని చేసింది. ప్రజలు ఈ తేడాను గమనించారు. ప్రజల మానసిక స్థితిని కెసిఆర్ గట్టిగా పట్టుకున్నారు. కెసిఆర్ ఇచ్చిన ప్రతి పిలుపుకు ప్రజలు ప్రతి ధ్వని అయ్యారు. అందుకే సుడిగాలి పర్యటనలు కెసిఆర్‌కు కలిసి వచ్చాయి. కెసిఆర్ సుడిగాలి ఎన్నికల పర్యటనల గురించి దిన పత్రికల్లో వచ్చిన కొన్ని కీలక రిపోర్టులకు రెండు వందల పేజీలను కేటాయించారు.

ఎన్నికల్లో టిఆర్ఎస్ సంపూర్ణ విజయం తర్వాత కొలువు తీరిన కెసిఆర్, ఆయన తీసుకున్న నిర్ణయాలు, ప్రజా రంజక పాలన గురించి వివిధ పత్రికల్లో వచ్చిన వార్తా కథనాలను ఇచ్చారు. వ్యాసాలు, వార్తా కథనాలు, రిపోర్టులను గుదిగుచ్చి 'జయుడు' పేరుతో ఈ సంకలనాన్ని తీసుకువచ్చారు. దీనికి 'జయుడు' బదులుగా 'విజేత' అనే పేరు పెడితే ఇంకా బాగుండేది.

- కె.పి. అశోక్‌కుమార్

మీరూ రాయండి

మీరు చదివిన వాటిలో మీకు బాగా నచ్చిన పుస్తకం గురించి ఈ శీర్షికకు రాసి పంపండి. మీ ఫొటో కూడా జతచేయండి. పుస్తకంలో మీకు నచ్చిన అంశాల గురించి రాయండి. పుస్తకం ఎందుకు నచ్చిందో ఒకటీ రెండు మాటల్లో చెబితే మంచిది. 'నాకు నచ్చిన పుస్తకం' శీర్షికన ప్రచురిస్తాం. మీ అభిప్రాయాలు చేరాల్సిన చిరునామా: సోపతి, ప్రజాశక్తి ఆదివారం సంచిక,
ప్లాట్ నెం.21/1, ఎం.హెచ్.భవన్, ఆజమాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా,
బాగలింగంపల్లి, హైదరాబాద్-500030.

నాకు నచ్చిన పుస్తకం

భువన ఘోష

ఈ సంవత్సరంలో చదివిన సాహిత్యంలో నన్ను అమితంగా ఆకట్టుకున్న పాబ్లోనెరుడా కవిత్వం "భువనఘోష". ఈ కవితా సంపుటి కీ.శే. విరిమాల లక్ష్మపతి గారి సంపాదకత్వంలో 2009వ సంవత్సరంలో వెలువడింది. ఆరువేల పేజీల పై చిలుకు కవిత్వం రాసి జీవితాన్ని, జీవితంలో ప్రతిచిన్న విషయాన్ని ప్రేమించిన నెరుడా పదేళ్ళకే కవిత్వం రాశాడంటే ఆశ్చర్యమేసింది.

ప్రావీణ్యత వచ్చినపుడు. కవి ఇతరుల నుండి నేర్చుకోవాలని చెప్పిన నెరుడా జీవితాంతమూ శ్రమజీవికి ముందు వెనుకా నడిచారు. మహానదిలా ప్రవహించే ఆయన కవిత్వం చదువుతుంటే మనల్ని మనం మరచిపోతాం.

శ్రీ.శ్రీ. డా॥ అవంచ్స సోమసుందర్, డా॥ దేవరాజు మహారాజు, డా॥ అద్దేపల్లి, ఇస్మాయిల్, డా॥ఎన్. గోపి, ఎల్.ఆర్. స్వామి, ముకుంద రామారావు మొదలైన 50 మంది ప్రసిద్ధ సాహిత్య కారులు అనువదించిన 92 కవితలు ఈ కవితా సంపుటిలో వున్నాయి. ఒక్కొక్కటి ఒక్కొక్క ఆణిముత్యం.

"గతం" అనే కవితను శముకుందరామారావుగారు అనువదించారు. ఈ కవితలో "మనం గతాన్ని విడిచిపెట్టాలి/ అంతస్తు మీద అంతస్తు కడుతున్నట్టు/కిటికీలమీద కిటికలతో భవనం లేస్తుంది./అలాగే వదిలేస్తుంటాం"అంటూ" జ్ఞాపకాలంటే ఏమికాదు/ ఇప్పుడు బరువెక్కిన రెప్పలు/ కంటి వెలుగును మూసేసాయి/ఒకప్పుడు సజీవంగా ఉన్నవి/ ఇప్పుడిక బతకటం లేదు" అని ఒక జీవన తాత్వికతను తెలుపుతారు-నెరుడా.

అలాగే మరో కవిత "పూర్ణాధికారం" ఈ కవితను శ్రీగరికపాటి పవన్‌కుమార్ అనువదించారు. ఈ కవితలో "లిఖిస్తాను నడి ఎండన, నమ్మర్థపు వీధిలోన/ పోటెత్తిన సముద్రాన, ఎక్కడనే పొడగలనో/అల్లాడే రాత్రి ఒకటి అడ్డగిస్తుంది నన్ను/ ఆ అంతరామ వ్యవధిలోన పోగేస్తా ఆకాశం/ పోగేస్తా నిశి నీడలు, నిలిచేందుకు బహుకాలం" అంటూ ఒక ఆశావాద దృక్పథాన్ని ఈ ప్రపంచానికి అందించిన నెరుడా కవిత్వం నన్ను నిలువెల్లా తడిపి, తరింపజేసి వెలుతురు స్నానం చెయించింది. ఇంతమంచి కవిత్వాన్ని ప్రపంచానికందించిన పాబ్లో నెరుడా కార్మిక లోకపు కళ్యాణానికి, శ్రామిక లోకపు సౌభాగ్యానికి కృషి చేయటమే కాక ఫాసిస్టు శక్తుల్నీ ఎదిరించి ప్రజా స్వామ్యాన్ని రక్షించడానికి తన వంతు బాధ్యత వహించి చిలీదేశపు ముద్దుబిడ్డగా పేరు ప్రఖ్యాతలు పొందారు ఈయన స్టాలిన్ అభిమాని మాత్రమే కాకుండా స్టాలిన్ శాంతి బహుమతి, అలాగే 1971లో నోబెల్ పురస్కారం పొందారు.

- కె. విల్సన్‌రావు, 8985435515

■ ఈ వారం కవిత్వం

కవి ఉద్వేగాలు

ఆయన మాట్లాడినప్పుడు
చంద్రనిప్పులు కురిసివుండొచ్చు –
కానీ దహించింది సమాజంలో అసమానతలే –
ఆయన మాట్లాడినప్పుడు
సముద్రపు హోరు విన్పించి వుండొచ్చు –
కానీ ముంచేసింది వ్యవస్థలో అవకతవకలే –
ఆయన మాట్లాడినప్పుడు
ఎరుపురంగు పరుచుకొని వుండొచ్చు –
కానీ
శబ్దించకుండా ఉద్యమం, ప్రశ్నించకుండా ఉదయం సాధ్యమా?
ఆయన
ఉరిమినట్టుగా మాట్లాడ్తేనే
కత్తిఝళిపించినట్టుగా మాట్లాడ్తేనే
ఆవేశం శరీరం నిండా నిండినప్పుడు
ఫైర్‌బ్రాండ్‌లా తూటాలై పేల్తేనే లెక్క –
ప్రభుత్వాన్ని గిల్లుతున్నాయనుకుంటే ఎలా?
ప్రజల కన్నుల చెమ్మగిల్లడం చూడరా –
ఎత్తి చూపేది ఎత్తు పల్లాల్ని సవరించడానికే
వత్తి పలికేది ఎగుడుదిగుడుల్ని అధిగమించడాన్కే –
కవి ఉద్వేగాలు ఊరికేపోవు, ఉక్కుపిడికిళ్ళవుతాయి

– కోటం చంద్రశేఖర్, 9492043348

గుడిహాళం కోసం

ఆప్యాయంగా నా భుజంమీద
నువ్వు వదిలివెళ్ళిన చేతి గుర్తులు
ఇంకా తడితడిగానే తగుల్తున్నాయి
ఏకాంతంలో గాయపడ్డ పద్యానివై
నిశ్శబ్ద యుద్ధమే చేస్తున్నావనుకున్నా...!
పద్యంలో యిముడాల్సిన అందం కోసం
పరితపిస్తూనే యడాగమన సంధివవుతున్నావనుకున్నా...!
కలల సౌధం నీడన బతుకు సొదల బరువును
బాధ్యతగానే మోస్తున్నావనుకున్నా...!
తుఫాను రాత్రంతటి కారిన్యాన్ని తొడుక్కుని
అయినవాళ్ళ ఆకాంక్షల ఆకాశంమీద
మరణమృదంగాన్నావిష్కరిస్తావనుకోలేదు
నీ జ్వలితాక్షర శిల్ప సౌరభాలను తుంచి
మనసు కాన్వాసు మీద పులుముకున్న వాన్ని
నువ్వు జారవిడిచిన విషాద గాలానికి చెక్కి
విలవిల్లాడుతున్న సమాంతర సాహితీ చెలిమిని
కారణాలు ఏవైనా కాలం నీడైపోయావు గదా!



ఆవలి తీరం చేరిన ఓ నా గుడిహాళమా
నువ్వు వదిలి వెళ్ళిన అపూర్వ సాయంత్రాల్ని
ఆరగించుకోవటం ఎలాగో తెలియని వాన్ని కదా!
అయినా నీ అక్షర కొలుముల్లోంచి
ఉప్పొంగే లావానలాన్ని పదిలపరుస్తున్నా...!
నిన్ను నువ్వు నిలువునా శిక్షించుకోటానికి
మృత్యువుకన్నా మించిన ఆయుధం నీకనిపించలేదా!
నిన్ను నువ్వు ఖాళీ చేసుకున్నంత సులభంగా
నీ జ్ఞాపకాన్ని దూరం చేసుకోలేనితనం నాది
మంచు అదే పనిగా కురుస్తూనే వుంది ఆ రోజులానే
అందులో నీ బొమ్మ స్పష్టంగా కదలాడుతుందిగా
నీ కవితా పంక్తుల స్మృతుల్లోంచే క్షమార్హమైన
నా కవితా దినచర్య మొదలవుతూనే వుంటుంది
నీ అక్షరాల మీద ఆన అందాకా... సెలవా మరి...

– పరమాత్మ, 9848552512

(రేపు కవి గుడిహాళం రఘునాథం వర్ధంతి)



మానవ నిర్మితాలైన పెద్ద పెద్ద కట్టడాలను ఎన్నో చూశాం. కానీ 1800 కిలోమీటర్ల పొడవున్న మనుషులు తవ్విన కాలువను చూశారా? అది చైనాలో ఉంది. బీజింగ్‌లో మొదలైన ఈ కాలువ ఝెంజియాంగ్‌లోని హాంగ్‌జూ దగ్గర ముగుస్తుంది.

మానవ నిర్మితమైన కాలువల్లో ప్రపంచంలోకెల్లా ఇదే పెద్దది. ఇది ఒక్కసారిగా తవ్వలేదు. క్రీ.పూ ఐదో శతాబ్దంలో దీన్ని మొదలుపెట్టారు. మధ్యలో ఎన్నో అవాంతరాలు. మళ్లీ పదమూడో శతాబ్దంలో 700 కిలోమీటర్ల పొడవుకు పెంచారు. అలా దశల వారీగా ఇప్పుడు ఇంత పెద్దగా తయారైంది.



నిర్జీవంగా, కళాకాంతులు లేని మొండి గోడలకు ఫ్రెంచ్ ఆర్టిస్ట్ పాట్రిక్ కామెన్సీ బృందం కొత్త జీవానిచ్చారు. రంగు వెలిసి పోయి పాత బడిన గోడలను ఎంచుకుని వాటిమీద కిటికీలు, బాల్కనీలు, వాటికి అల్లుకున్న లతలు, బాల్కనీలో నుంచుని బయటికి చూస్తున్న మనుషులు, ఎగురుతున్న పక్షులు... ఇలా ఎన్నో రకాల ఊహలకు తన కుంచెతో రూపమిచ్చాడు పాట్రిక్. ఈయన చిత్రించిన పాత్రలలో ఎక్కువ భాగం ప్రముఖ నవలా రచయిత గాబ్రియెల్ చెవాలియర్ నవల అయిన 'క్లోచెమిరెల్' నవలలోనివే.